Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue): 147 పేజీలు (Pages): 8 వెల: రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

బుధవారం, 17 - 12 - 2025

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం: 2015

## చిన్నారిపై హత్యాచారం కేసు.. రాష్ట్రపతి క్షమాభిక్ష తిరస్కరణ




**ఇంటర్నెట్ డెస్క్:** రెండేళ్ల బాలికను అపహరించి, ఆపై హత్యాచారానికి పాల్పడిన ఘటనలో నిందితుడి క్షమాభిక్ష పిటిషన్‌ను రాష్ట్రపతి దౌపది ముర్ము తిరిస్కరించారు. ఆమె దేశాధ్యక్షురాలిగా పదవీ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి తిరస్కరణకు గురైన వాటిలో ఇది మూడో క్షమాభిక్ష పిటిషన్‌గా నిలిచింది.

**ఇదీ కేసు..**

మహారాష్ట్ర జల్నా నగరంలోని ఇందిరానగర్ ప్రాంతంలో.. 2012లో అశోక్ ఘుమారే అనే వ్యక్తి రెండేళ్ల చిన్నారిని చాక్లెట్ ఇస్తానని ప్రలోభపెట్టి కిడ్నాప్ చేశాడు. తర్వాత ఆమెపై అత్యాచారానికి పాల్పడి, చివరకు ఆ పసికందును హతమార్చాడు. ఈ కేసుపై విచారణ చేపట్టిన ట్రయల్ కోర్టు.. నిందితుడైన అశోక్‌కు మరణ శిక్ష విధిస్తూ 2015 సెప్టెంబర్ 15 తీర్పునిచ్చింది. దీనిని 2016 జనవరిలో బాంబే హైకోర్టు సమర్థించింది. ఆ తర్వాత.. సుప్రీం న్యాయస్థానంలో ఈ కేసు విచారణకు రాగా 2019 అక్టోబర్ 03న అతడిపై మరణ శిక్షను ధృవీకరిస్తూ.. నిందితుడు తన లైంగిక వాంఛ తీర్చుకోవడం కోసం సామాజిక, చట్టపరమైన నిబంధలను ఉల్లంఘించాడని పేర్కొంది. ఈ విషయమై అశోక్ ఘుమారే.. క్షమాభిక్ష కోరుతూ రాష్ట్రపతికి పిటిషన్ వేసినట్టు రాష్ట్రపతి భవన్ వెల్లడించింది. అయితే ఆ పిటిషన్‌ను దేశ ప్రథమ పౌరురాలు ద్రౌపది ముర్ము తిరస్కరించారని అధికారులు తెలిపారు. దీంతో నిందితునికి మరణశిక్ష ఖాయమైనట్టైంది.

## వైసీపీ కోటి సంతకాల సేకరణ నాటకం.. బూటకం



**అమరావతి, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలోని వైద్య కళాశాలల వ్యవహారంలో పీపీపీ విధానంలో వెళ్లాలని చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిర్ణయాన్ని వైసీపీ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ.. ఆ పార్టీ కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించింది. అలాంటి వేళ పీపీపీ విధానంలో వైద్య కళాశాలల నిర్మాణంపై పార్లమెంట్ స్థాయి సంఘం పలు సిఫార్సులు చేసింది. దీనిపై రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి మంగళవారం విజయవాడలో స్పందించారు. ఈ సిఫార్సులు వైసీపీకి చెంపపెట్టు అని ఆయన స్పష్టం చేశారు. వైద్య విద్య ఖర్చు విపరీతంగా పెరిగిపోతున్న క్రమంలో ఎక్కువ మందికి వైద్య విద్య అందించాలంటే ఈ విధానం తప్ప మరో ప్రత్యామ్నాయం లేదని కేంద్రం స్పష్టం చేసిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. వైసీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ నాటకమంతా ఒక బూటకమని అభివర్ణించారు. మెడికల్ కాలేజీల నిర్మాణానికి.. ప్రవేటీకరణకు ఉన్న వ్యత్యాసాన్ని సైతం గుర్తించకుండా దుష్ప్రచారం చేస్తోందంటూ వైసీపీపై ఆయన నిప్పులు చెరిగారు. ఈ పీపీపీ విధానం వల్ల కలిగి ప్రయోజనాలను ఆయన సోదాహరణగా వివరించారు. ఒక్కో మెడికల్ కాలేజీలో 250 యూజీ సీట్లు పెంచుకునే వెసులుబాటు ఉందని తన నివేదికలో పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ స్పష్టం చేసిందని గుర్తు చేశారు. మెడికల్ కాలేజీల నిర్మాణంపై హైకోర్టు సమర్థించినా ప్రతిపక్ష నేతల్లో మార్పు కనిపించక పోవడం దురదృష్టకరమని చెప్పారు. మెడికల్ కాలేజీల నిర్మాణంపై ఎక్కడైనా చర్చకు తమ కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని వైసీపీ నేతలకు మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి సవాల్ విసిరారు. మెడికల్ కాలేజీల నిర్మాణం చేపట్టడం ద్వారా వైద్య విద్య మెరుగు పడటంతోపాటు నిరుపేదలకు మెరుగైన వైద్యం సాయం అందించగలమని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. అదనంగా 220 సీట్లు రాష్ట్రంలో పెరగడంతో పాటు, 110 సీట్లు ప్రభుత్వ (కన్వీనర్) కోటాలో పెరగనున్నాయన్నారు. వైసీపీ పాలనలో 17 మెడికల్ కాలేజీల నిర్మాణాలకు రూ. 8,400 కోట్లు ఖర్చు చేయాల్సి ఉండగా.. కేవలం రూ.1,451 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టి చేతులు దులుపుకున్నారని వివరించారు. 151 సీట్లతో ప్రజలు అధికారం కట్టబెడితే, 17 మెడికల్ కాలేజీలు నిర్మించలేని.. మీరు నేడు ప్రజలను మభ్య పెట్టేందుకు ప్రయత్నించడం సిగ్గుచేటు అంటూ వైసీపీ నేతల వైఖరిని ఆయన ఎండగట్టారు. రానున్న రెండేళ్లలో కాలేజీ నిర్మాణాలు పూర్తి చేసి, రాష్ట్ర విద్యార్థులకు అదనంగా 1750 సీట్లు పొందేందుకు వెసులుబాటు కల్పిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వమే వైద్య కళాశాలలు, ఆసుపత్రుల యాజమాన్యాన్ని కొనసాగిస్తుందని.. ప్రవేట్ భాగస్వామి కేవలం మౌలిక సదుపాయాల కల్పన, నిర్వహణలో సహాయం అందిస్తుందని ఆయన వివరించారు. సామాన్య ప్రజల విషయం పక్కన పెడితే, మీరు చేస్తున్న నిరసనలకు కనీసం వైసీపీ కార్యకర్తల నుంచి కూడా స్పందన కరువైందని అన్నారు.

## సంజీవని ప్రాజెక్టుతో డిజిటల్ హెల్త్ రికార్డులు : సీఎం చంద్రబాబు



**అమరావతి, (రాజధాని వార్తలు):** వైద్యారోగ్య రంగంలో వివిధ ప్రమాణాలను అందుకునేలా ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన సూచనలను అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. మంగళవారం సచివాలయంలో వైద్యారోగ్య రంగంలో అత్యున్నత స్థాయి నిపుణుల సలహా బృందంతో సీఎం చంద్రబాబు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పౌరులకు సంబం ధించిన డిజిటల్ హెల్త్ రికార్డులను సంజీవని ప్రాజెక్టు ద్వారా రూపొందిస్తున్నామని ఈ సందర్భంగా సీఎం తెలిపారు. గేట్స్ ఫౌండేషన్ సహకారంతో కుప్పం, చిత్తూరు జిల్లాల్లో డిజిటల్ నెర్వ్ సెంటర్ ద్వారా ఈ వివరాలను సేకరించి ఇంటిగ్రేట్ చేశామన్నారు. రియల్ టైమ్‌లోనే వారి వివరాలు తెలుసుకునేలా సంజీవని ద్వారా ఇంటిగ్రేట్ చేస్తున్నామని చెప్పారు. వివిధ అంశాల్లో పౌరులకు సంబంధించిన ఆరోగ్య సమాచారం అందుబాటులో ఉంటుందన్నారు. 2047 స్వర్ణాంధ్రప్రదేశ్ లక్ష్యాల ద్వారా అంతిమంగా ప్రజల జీవన ప్రమాణాలు పెంచేలా ప్రయత్నాలు చేస్తున్నామని వెల్లడించారు. ఆరోగ్య సమస్యల కోసం యోగాతో పాటు నేచురోపతిని ప్రోత్సహించాల్సి ఉందని అన్నారు. ప్రివెంటివ్ వెల్ నెస్, డిజిటల్ ఏఐ ఎనేబుల్డ్ హెల్త్, హెల్త్ ఫైనాన్సింగ్ రిఫార్మ్స్ లాంటి కీలకమైన అంశాలపై దృష్టి పెట్టాలని సూచించారు. వైద్యారోగ్య రంగంలో మౌలిక సదుపాయాలు పెద్దఎత్తున పెరగాలన్నారు. ఏపీలో మెడ్ టెక్ పార్కు ద్వారా అధునాతన వైద్య పరికరాలను రూపొందిస్తున్నామని సీఎం తెలిపారు. రోగం వచ్చిన తర్వాత తీసుకునే జాగ్రత్తల కంటే ఆ జబ్బు రాకుండా ముందస్తుగానే నియంత్రించేలా ప్రివెంటివ్ టెక్నాలజీస్‌పై దృష్టి పెట్టాలని సూచనలు చేశారు. తద్వారా వైద్యారోగ్యంపై వ్యయాన్ని గణనీయంగా తగ్గించే అవకాశం ఉంటుందన్నారు. వైద్యారోగ్య రంగంలో మరింత వినూత్నంగా ప్రాజెక్టులు చేపట్టేందుకు అత్యున్నత స్థాయి ఎక్స్‌పర్ట్ గ్రూప్ సలహాలు ఇవ్వాలని కోరుతున్నామన్నారు. ప్రతీ రంగంలోనూ టెక్నాలజీ ద్వారా అత్యుత్తమ ప్రమాణాలు తీసుకురావాలన్నదే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. సామర్థ్యాల పెంపుతో పాటు ప్రజలకు అత్యున్నత సేవలు అందాలన్నారు. క్వాంటం, ఏఐతో రియల్ టైమ్ డేటా విశ్లేషణలాంటి వాటి ద్వారా ప్రజలకు సేవలు అందాలని చెప్పారు. ప్రస్తుతం ఏఐ ద్వారా నాలెడ్జి వ్యవస్థీకృతం అయ్యిందన్నారు. గ్లోబల్ కమ్యూనిటీకి సేవలు అందించేలా ప్రస్తుతం అంతా సామర్థ్యాలను పెంచుకోవాల్సి ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. కాగా... అత్యున్నత స్థాయి నిపుణుల సలహా బృందంలో యూఎస్ ఏఐడీఎస్ ప్రతినిధి పీటర్ పాయిట్, డబ్ల్యూహెచ్‌వో సైంటిస్ట్ సౌమ్య స్వామినాథన్, ఎఐజీ చైర్మన్ డి.నాగేశ్వర్ రెడ్డి, సింగపూర్ ప్రతినిధి ప్రొఫెసర్ ఇక్ ఇంగ్ టియో, ఆర్తి అహుజా, రిజ్వాన్ కొయిటా, శ్రీకాంత్ నాదముని, గగన్ దీప్ కాంగ్, మార్గరెట్ ఎలిజిబెత్, నిఖిల్ టాండన్, ఇతర వైద్య నిపుణులు ఉన్నారు. ఈ సమావేశంలో మంత్రి సత్యకుమార్ యాదవ్, వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులు, గేట్స్ ఫౌండేషన్ కంట్రీ డైరెక్టర్ అర్చనా వ్యాస్ తదితరులు పాల్గొన్నారు.

## రుషికొండ ప్యాలెస్‌పై సబ్ కమిటీ కీలక నిర్ణయం




**అమరావతి, (రాజధాని వార్తలు):** రుషికొండ గత సీఎం తన నివాసం కోసం ఏర్పాటు చేసుకున్నారని మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. రిషికొండ ప్యాలెస్‌ను ఎలా వినియోగించాలన్న అంశంపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీ సచివాలయంలో మంగళవారం భేటీ అయ్యింది. అనంతరం మంత్రులు మీడియాతో మాట్లాడారు. రుషికొండ ప్యాలెస్ మెయింటెనెన్స్ కోసం ప్రతి నెల రూ.25 నుంచి రూ.30 లక్షల వరకు ఖర్చు అవుతోందని మంత్రి పయ్యావుల అన్నారు. ఇప్పటికే టాటాతో పాటు కొన్ని సంస్థలు ముందుకు వచ్చాయని.. వాళ్లకు ఎలా వినియోగంలోకి వస్తుంది అన్న దానిపై చర్చిస్తున్నట్లు చెప్పారు. హెూటల్ కోసం కొందరు ముందుకు వచ్చారన్నారు. రుషికొండ పేరుతో ఎంత ప్రజాధనం వృథా చేశారో.. దానిపై ప్రజల నిరసన ఎలా వచ్చిందో చూశామని మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. టూరిజంకు ఆదాయం వచ్చేలా చేస్తామని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఇప్పటికే కొందరు ముందుకు వచ్చారన్నారు. వాళ్లకు ఎలా వయబుల్ అవుతాయో చూడాలని తెలిపారు. మరోసారి చర్చించి రుషికొండ ప్యాలెస్ వినియోగంపై ముందుకు వెళతామని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. సచివాలయంలో జరిగిన భేటీలో మంత్రులు పయ్యావుల కేశవ్, కందుల దుర్గేష్, డోలా బాల వీరాంజనేయ స్వామి, పర్యాటక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్, టూరిజం ఎండీ, ఏపీటీఏ సీఈఓ ఆమ్రపాలి కాట, పర్యాటక శాఖ అధికారులు పాల్గొన్నారు.

## సాయి ప్రభుత్వం రెండేళ్లు : తన సొంత కోటలో చిక్కుకున్న విష్ణుదేవ్ సాయి - దివాకర్ ముక్తిబోధ్, సీనియర్ జర్నలిస్టు

**ఛత్తీస్‌గఢ్ :** ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రిగా విష్ణుదేవ్ సాయి రెండేళ్లు పూర్తి చేసుకున్నారు. ఆయన డిసెంబర్ 13, 2023న పదవీ బాధ్యతలు స్వీకరించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిచిన తర్వాత, సామాజిక సమానత్వానికి అనుగుణంగా, బిజెపి కేంద్ర నాయకత్వం, ఛత్తీస్‌గఢ్‌లో ప్రభుత్వ నాయకత్వాన్ని గిరిజన ఎమ్మెల్యేకు అప్పగించాలని నిర్ణయించింది. రాష్ట్ర జనాభాలో దాదాపు 33 శాతం ఉన్న గిరిజన సమాజం నుండి మొదటిసారిగా రాష్ట్రం ముఖ్యమంత్రిని పొందుతున్నందున ఈ నిర్ణయం విస్తృతంగా ప్రశంసించబడింది. విష్ణుదేవ్ సాయి సుర్గుజా డివిజన్‌లోని కుంకురికి చెందినవాడు. ఆయన రాష్ట్రంలో ప్రముఖ సీనియర్ గిరిజన నాయకుడు, బిజెపి నాయకత్వం దాదాపు నాలుగు దశాబ్దాల రాజకీయ జీవితంలో ఆయనకు చాలా ఇచ్చింది. ఆయన ఎమ్మెల్యేగా, ఎంపీగా, కేంద్ర మంత్రిగా ఇంకా రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా పనిచేశారు.

ఇప్పుడు మొదటిసారి ఆయన ముఖ్యమంత్రి అయ్యారు. ఆయన విస్తృత రాజకీయ అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుంటే రాష్ట్రం, దాని ప్రజలు ఆయన నాయక త్వంలో ప్రయోజనం పొందుతారని నమ్మడం సహజం. సంక్షేమం అంటే ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీతనం, దాని పనితీరులో పారదర్శకత అవసరమైన వారికి సీనియర్ అధికారులు, మంత్రు లు ఇంకా ప్రజాప్రతినిధులను నేరుగా సులభంగా చేరుకోవ డం, నగరాలకు ఇంకా చిన్న గ్రామాలకు కూడా రోడ్డు అనుసం ధానం వంటి భౌతిక వనరులు, విద్యుత్, నీరు, విద్య, ఆరోగ్యం, ఉపాధి లభ్యత ఇంకా అన్ని రకాల కాలుష్యం నుండి విముక్తి. అన్ని పథకాలను నిజాయితీగా, సకాలంలో పర్యవేక్షించడంతో పాటు ఇవి ఏ సంక్షేమ ప్రభుత్వానికైనా నిరంతర ప్రక్రియలుగా ఉండాలి. ఈ ప్రాతిపదికననే ప్రభుత్వం యొక్క పనితీరును ఏటా అంచనా వేస్తారు. ఈ అంచనాను ప్రజలే చేస్తారు. ప్రజలు సాయి ప్రభుత్వ పాలనలో రెండు సంవత్సరాలు చూశారు. కాబట్టి, వారిలో అభిప్రాయాలు ఏర్పడటం ప్రారంభించాయి. ప్రస్తుతం నలుమూలల నుండి వస్తున్న అభిప్రాయాలు సాయి ప్రభుత్వానికి సానుకూలంగా లేవు. అయితే, మసకబారిన ప్రతిష్టను మెరుగుపరుచుకోవడానికి ఇంకా మూడు సంవత్సరాల సమయం ఉంది. విష్ణుదేవ్ సాయి సరళమైన స్వభావం కలిగి ఉన్నాకానీ అతను తన సొంత కోటకే పరిమితమయ్యాడు. ముగ్గురు మాజీ ముఖ్యమంత్రులు, దివంగత అజిత్ జోగి, డాక్టర్ రమణ్ సింగ్, భూపేశ్ బఘేల్‌ల రాజకీయ లేదా పాలనా శైలులు ఎలా ఉన్నా, వారు సామాన్య ప్రజలతో సంభాషించే అవకాశాన్ని ఎప్పుడూ వదులుకోలేదు. వారు మీడియాకు సులభంగా అందుబాటులో ఉండేవారు. కానీ సాయి అలా కాదు. ముఖ్యమంత్రి సభలో ఆయనను కలవడానికి మీడియా సభ్యులు, సాధారణ పౌరులు ఇబ్బంది పడాల్సి వచ్చింది. ఇప్పటివరకు ఆయన పాలనను చూస్తే, ఆయన తన పదవి గురించి పెద్దగా పట్టించుకోలేదనే అభిప్రాయం కలుగుతుంది. బహుశా ఆయన ఎప్పుడూ అధికారాన్ని వెంబడించకపోవడం వల్ల కావచ్చు. ఆయన సరళత, సౌమ్యత, పార్టీ పట్ల అచంచలమైన విధేయత, స్వాభావిక నిజా యితీ, ఉన్నత పాఠశాల విద్య, వివాదాస్పదరహిత, సాధారణ గిరిజన నాయకుడు కావడం గొప్ప ప్రయోజనాలను తెచ్చిపె ట్టాయి. అయితే ఆయన కేంద్ర నాయకత్వం నుండి ఎప్పుడూ ఏమీ డిమాండ్ చేయలేదు. అతని రాజకీయ ఆశయాలు ఎప్పుడూ పెరగలేదు. అతను చాలా సంతృప్తిగా ఉండి, తాను ఐదేళ్లపాటు ముఖ్యమంత్రిగా ఉంటానని అర్థం చేసుకున్నాడు. ఆయన కూడా ఒక గిరిజనుడు, కాబట్టి




ఆయన తొలగింపు ప్రశ్నే లేదు. ఈ అవగాహన పూర్తిగా నిజం, అయితే రాజకీయాల్లో, ఒంటె ఏ వైపు తిరుగుతుందో ఎవరూ ఊహించలేరు.

అయితే, రాబోయే మూడు సంవత్సరాలలో ప్రభు త్వం ఎలా పనిచేసినప్పటికీ, అది రిమోట్ కంట్రోల్ ద్వారా జరిగినా సరే, ఛత్తీస్‌గఢ్‌లో వివిధ ప్రయోజనాలు ఉన్న పార్టీకి మరియు కేంద్ర నాయకత్వానికి ఆయన ముఖ్యమంత్రిగా కొనసా గడం ప్రయోజనకరంగా ఉంటుంది. ప్రభుత్వ పథకాలు, అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల విషయానికొస్తే, అవి అమలు చేయబడుతున్నాయి. కానీ వాటి వేగం, పని నాణ్యతను అంచనా వేయడానికి ప్రభుత్వానికి వ్యవస్థ లేదు. ప్రభుత్వం పట్టించుకోనట్లు కనిపిస్తోంది. అన్ని విభాగాల్లో గందరగోళం నెలకొన్నప్పటికీ ఆరోగ్య రంగంలో పరిస్థితి అత్యంత దారుణంగా ఉంది. వార్తాపత్రికలు మరియు సోషల్ మీడియాలో ఏదో ఒక కుంభకోణం గురించిన వార్తలు లేకుండా ఒక్క రోజు కూడా గడవడం లేదు. భూపేష్ బఘేల్ ప్రభుత్వంలో పెద్ద ఎత్తున అవినీతి బయటపడింది. అరెస్టులు జరిగాయి. కానీ అవినీతి వ్యవస్థను అరికట్టడం ఏ ప్రభుత్వానికైనా అసాధ్యం, ప్రత్యేకించి సీనియర్ మరియు జూనియర్ అధికారులు చాలా మంది అవినీతిలో కూరుకుపోయినప్పుడు ఇది మరింత కష్టం. అందువల్ల, ఈ విషయంలో విష్ణుదేవ్ సాయి ప్రభుత్వం ఏదైనా అర్థవంతమైనది సాధిస్తుందని ఆశించడం వ్యర్థం. పరిస్థితి యథాతథంగానే ఉంది.

ప్రస్తుతం ఒక సానుకూల పరిణామం ప్రభుత్వానికి అనుకూలంగా మారింది. రాష్ట్రానికి ఒక సమర్థుడైన ఐఏఎస్ అధికారి కొత్త ప్రధాన కార్య దర్శిగా వచ్చారు, ఆయన బాధ్యతలు స్వీకరించి కేవలం రెండు నెలలే అయింది. ఈ స్వల్ప కాలంలోనే ఆయన తన పదవీకాలంలో పరిపాలనా యంత్రాంగం పరిస్థితిని రాష్ట్రంలోని ప్రస్తుత పరిస్థితులను అర్థం చేసుకుని ఉంటారు. కొన్ని రోజుల క్రితం కార్యదర్శులు ఉన్నతాధికారులతో జరిగిన సమావేశంలో ఆయన కొన్ని కఠినమైన నిర్ణయాలు తీసుకున్నారు. విభాగాలకు బడ్జెట్ కేటాయింపులు ఉన్నప్పటికీ పరిపాలనా అనుమతులకు తరచుగా నెలలు పడుతుండటం ఆయనను చాలా ఆశ్చర్యపరిచింది. ఉదాహరణకు, ఈ సంవత్సరం బడ్జెట్‌లో పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్‌కు రోడ్ల కోసం 9,500 కోట్లు కేటాయించారు. కానీ ఇప్పటివరకు 1,900 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. అయితే పట్టణ, గ్రామీణ రోడ్ల పరిస్థితి దారుణంగా ఉంది. ఇది ఆ శాఖ అధికారుల పనితీరుపై ఒక అవగాహనను ఇస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో, ముఖ్య కార్యదర్శి వికాస్‌షీల్ ఒక పెద్ద సవాలును ఎదుర్కొంటున్నారు: అవసరమైన వారు ప్రభుత్వ కొత్త, పాత పథకాల నుండి సులభంగా ప్రయోజనం పొందేలా వాటిని ప్రజల వద్దకు ఎలా తీసుకు వెళ్లాలి? (మిగతా 8వ పేజీలో)

# 41 వార్డులో రూ. 2 కోట్ల 63 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**- 24 లక్షలతో నూతన భవనం ప్రారంభించిన మేయర్ శ్రీనివాస్, స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్**

**- ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అన్ని వార్డుల్లో దాదాపుగా అభివృద్ధి పనులు పూర్తి చేశామన్న ఎమ్మెల్యే**

**- నియోజవర్గ అభివృద్ధికి పూర్తి సహకారం అందించిన మేయర్ కి ధన్యవాదాలు తెలిపిన ఎమ్మెల్యే**



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** విశాఖ నగరంలో అన్ని వార్డుల అభివృద్ధికి నిరంతరం కృషి చేయడం జరుగుతుం దని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం ఆయన 5వ జోన్ 41 వార్డు పరిధిలోని జ్ఞానాపురం నందు సుమారు రూ.2.89 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు దక్షిణ నియోజవర్గం శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్, కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమలతో కలిసి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం విశాఖ నగర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. జ్ఞానాపురం నందు జీవీఎంసీ నిధులతో సుమారు రూ.185.08 లక్షల వ్యయంతో హిందూ స్మశాన వాటిక నందు రక్షణ కూడా సీసీ కాలువలు మొరుగుదొడ్ల నిర్మాణానికి, సుమారు రూ. 78.81 లక్షల వ్యయంతో కొండవీటి గడ్డ వీధి పోస్ట్ ఆఫీస్ తదితర ప్రాంతాలలో సిసి రోడ్లు కాలువలు సిసి నిర్మాణానికి శంకుస్థాపన చేశామని, అలాగే జేఎన్ఎన్ యుఆర్ఎమ్ కాలనీలో సుమారు రూ. 24.85 లక్షల వ్యయంతో నిర్మించిన జీవీఎంసీ భవనానికి ప్రారంభోత్సవ కార్యక్రమం స్థానిక ఎమ్మెల్యేతో కలిసి చేసామన్నారు. జీవీఎంసీలో ప్రతి వార్డును అభివృద్ధి పరిచేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని మేయర్ తెలిపారు. అనంతరం దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోనే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విశాఖ నగర అభివృద్ధికి ప్రత్యేక కార్యచరణ చేపట్టిందని తెలిపారు. దక్షిణ నియోజకవర్గంలోని ప్రతి వార్డును ఆదర్శంగా తీసుకొని అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేయడం జరుగుతుందన్నారు. దక్షిణ నియోజకవర్గం పరిధిలో జ్ఞానపురం నందు సుమారు రూ. 2.89 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం



చుట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ రాము, జీవీఎంసీ కార్య నిర్వాహక ఇంజనీరు, ఉప కార్యనిర్వాహక ఇంజనీరు, కార్యదర్శులు, 41వ వార్డు టీడీపీ వార్డు అధ్యక్షులు మధు బాబు, జనసేన వార్డ్ అధ్యక్షులు అంతోని శేఖర్, బీజేపీ వార్డ్ అధ్యక్షులు సంజీవరావు, కూటమి నేతలు సునీత, గవర రమణ, బుల్లి, భార్గవ్, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పీజీఆర్ఎస్ వినతుల పరిష్కార క్రమంలో తూతూమంత్రపు చర్యలతో సరిపెట్టవద్దు

**- అధికారులను హెచ్చరించిన జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్**




**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** పీజీఆర్ఎస్ వేదికగా అందించే వినతుల పరిష్కార క్రమంలో ప్రజలను ఎట్టి పరిస్థితు ల్లోనూ ఇబ్బంది పెట్టవద్దని, తూతూమంత్రపు చర్యలతో సరిపెట్ట వద్దని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను ద్దేశించి అన్నారు. కార్యాలయాల చుట్టూ ప్రజలను తిప్పించుకో వటం గానీ, అమర్యాదగా ప్రవర్తించటం గానీ, గంటల తరబడి వేచియుంచటం గానీ చేయరాదని హెచ్చరించారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, రెవెన్యూ శాఖలు తమ పనితీరు మార్చుకోవాల్సి ఉందని, క్షేత్రస్థాయి పరిస్థితులకు అనుగుణంగా ఫిర్యాదులను నాణ్యమైన రీతిలో పరిష్కరించాలని సూచించారు. ఆర్డీవోలు, తహశీల్దార్లు వారి చర్యలను పునఃసమీక్షించుకోవాలని హితవు పలికారు. సోమవారం కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో ప్రజల నుంచి వినతులు తీసుకున్న క్రమంలో అధికారులకు పలు అంశాలపై ఆదేశాలు జారీ చేశారు. అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని, జవాబు దారీతనంతో పని చేయాలని పేర్కొన్నారు. ఫిర్యాదుల స్థితిగతులను ప్రజలకు తెలియజేయాల్సిన కనీస బాధ్యత అందరిపైనా ఉంటుందన్నారు. సర్వే, రెవెన్యూ, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ విభాగాలు వాటికందే ఫిర్యాదులను, తీసుకున్న చర్యలను పునఃపరిశీలించుకోవాలని సూచించారు.

**వివిధ సమస్యలపై 299 వినతులు**

సోమవారం కలెక్టరేట్లో జరిగిన పీజీఆర్ఎస్కు ప్రజలు వివిధ సమస్యలపై 299 వినతులు సమర్పించారు. వాటిలో రెవెన్యూ విభాగానికి చెందినవి 132 ఉండగా, జీవీఎంసీ 76, పోలీస్ విభాగానికి సంబంధించినవి 24, ఇతర విభాగాలకు చెందినవి 67 ఉన్నాయి. జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, ఇన్చార్జి డీఆర్వో సత్తిబాబు, విశాఖ ఇన్చార్జి ఆర్డీవో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అన్ని విభాగాల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

# నవ్వులు, ట్విస్టులు, డార్క్ కామెడీతో వస్తున్న గుర్రం పాపిరెడ్డి సినిమా


**– హీరో నరేష్, హీరోయిన్ ఫరియాలి**

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** యంగ్ హీరో నరేష్ అగస్త్య, అందాల నటి ఫరియా అబ్దుల్లా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న డార్క్ కామెడీ ఎంటర్టైనర్ 'గుర్రం పాపిరెడ్డి' ఈ చిత్రం ఈనెల డిసెంబర్ 19న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్గా విడుదల కానుంది. ఈ సందర్భంగా మూవీ టీమ్ విశాఖలో సందడి చేసింది. ఈ సందర్భంగా హీరో నరేష్, హీరోయిన్ ఫరియా లు మాట్లాడుతూ ఒక శవాన్ని దొంగిలించడానికి శ్రీశైలం అడవిలోకి వెళ్లిన నలుగురు స్నేహితుల చుట్టూ కథ తిరుగుతుందని ఈ క్రమంలో జరిగే గందరగోళం, అనూహ్య మలుపులు, మరియు హాస్యాన్ని మిళితం చేసి ఈ సినిమాను రూపొందించారన్నారు. లెజెండరీ నటుడు బ్రహ్మానందం న్యాయమూర్తి పాత్రలో కనిపించడం, అలాగే తమిళ నటుడు యోగి బాబు కూడా కీలక పాత్ర పోషించడం సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా




నిలవనుందన్నారు. ఈ సినిమాకు మురళిమనోహర్ దర్శకత్వం వహిస్తుండగా వేణు సద్ది, అమర్ బురా, జయకాంత్ సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నారని చెప్పారు.

# రత్నగిరికి పోటెత్తిన భక్తులు



**అన్నవరం, (రాజధాని వార్తలు):** కాకినాడ జిల్లా అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి సన్నిధిలో చండీ భక్తులతో సందడి నెలకొంది. మాఘమాసం మహా పర్వదినం శనివారం కావడంతో ఆలయ ప్రాంగణం, వ్రత మండపాలు, దర్శన క్యూలైన్‌లు చండీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. దేవస్థానం అధికారులు తెల్లవారుజామున నాలుగు గంటల నుండి వ్రత టిక్కెట్లు, దర్శనం టిక్కెట్లు ఇవ్వడం ప్రారంభించారు. భక్తులకు ఏ విధమైన ఇబ్బందులు కలగకుండా దేవస్థానం అధికారి వేంద్ర త్రినాథ రావు అధికారులకు తగిన సూచనలు ఇస్తూ, దర్శన క్యూలైన్లలో మంచినీరు, చిన్న పిల్లలకు పాలు పంచిపెట్టారు. ఎక్కడ ఏ విధమైన అసౌకర్యములు కలగకుండా భక్తులు దర్శనానంతరం అన్నదానం ట్రస్టులో భోజనాలు అందజేశారు. ఈరోజు స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను, తిరుచ్చి వాహనంపై ఆశీనులు గావింపజేసి సుగంధ పరిమళ భరితమైన పూలతో అలంకరించి అనంతరం స్వామి అమ్మవార్లను మాడవీధుల్లో ముమ్మారు ప్రదక్షిణ గావించారు. ఈ కార్యక్రమంలో ఈవో వేంద్ర త్రినాథరావు, సూపరింటెండెంట్, అధికారులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

# అధ్యాత్మిక తత్వానికి మారుపేరు శివప్రసాద్ మాస్టర్

**- టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు**



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** చిన్ననాటినుండి ఆధ్యాత్మిక వాతావరణంలో పెరిగి జీవితమంతా దైవభక్తికే అం కితం చేసిన గొప్ప అధ్యాత్మిక తత్వవేత్త శివప్రసాద్ మాస్టర్ అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, అనకాపల్లి నియోజకవర్గం సంస్థాగత ఎన్నికల పరిశీలకులు గంటా నూకరాజు అన్నారు. సోమవారం శివప్రసాద్ మాస్టర్ 4వ వర్ధంతి సందర్బంగా భీమి లిలో ఉన్న ఆయన శిష్యులు నిరుపేదలకు భోజనం ప్యాకెట్లు ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన గంటా నూకరాజు మాట్లాడుతూ బ్రహ్మచారిగా ఉంటూ జీవిత మంతా ఆధ్యాత్మికతకు అంకితం చేసిన గొప్ప ఆదర్శవంతులు శివ ప్రసాద్ మాస్టర్ అని అన్నారు. ఎంతోమందికి తన జీవిత కాలంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా సహాయసహకారాలు అందిం చిన గొప్ప మాతృమూర్తి మాస్టర్ అని అన్నారు. ఉపాధ్యాయ వృత్తిని చేస్తూ విద్యార్థులకు, సహచర ఉపాధ్యాయులకు మార్గద ర్శకులుగా నిలిచారని అన్నారు. మాస్టర్ భౌతికంగా మనమధ్య లేకపోయినా ఆయన అందించిన సేవలు రూపంలో అనుక్షణం మనమద్యే ఉంటారని అన్నారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని మనస్ఫూర్తిగా దేవుని ప్రార్దిస్తున్నానని గంటా నూక రాజు అన్నారు. ఈ కార్యక్రమంలో కాసరపు నాగరాజు, సంకురు భుక్త జోగారావు, వాడమొదలు సత్యారావు, నెక్కెళ్ళ వెంకటరావు, నొల్లి రమణ, రేగాని శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# విశాఖలో వైసీపీ భారీ ర్యాలీ

**- ర్యాలీకి తరలి వచ్చిన 41వ వార్డు కార్యకర్తలు, నాయకులు**

**- మెడికల్ కళాశాల ప్రైవేటీకరణ వ్యతిరేకంగా వైసీపీ ఉద్యమానికి ప్రజా మద్దతు**

**- తక్షణమే కూటమి ప్రభుత్వం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్**

**- 41వ వార్డు కార్పొరేటర్ పూర్ణిమ శ్రీధర్**

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** విశాఖలో వైఎస్ ఆర్సీపీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన కోటి సంత కాల కార్యక్రమంలో భాగంగా వైఎస్ఆర్సీపీ చేపట్టిన ర్యాలీలో భారీగా 41వ వార్డు కార్పొరేటర్ పూర్ణిమ, వార్డు అధ్యక్షులు శ్రీధర్ ఆధ్వర్యంలో భారీగా కార్యకర్తలు, నాయకులు తరలి వచ్చారు. జీవిఎంసీ నుంచి మద్దిలపాలేం తెలుగుతల్లి విగ్రహం వరకూ ర్యాలీ కొనసాగింది. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సేకరించిన కోటి సంతకాల ప్రతుల బాక్సులను పార్టీ సెంట్రల్ కార్యాలయానికి తరలించారు.ప్రభుత్వ నిర్ణయంతో విద్యార్థులు నష్టపోయే ప్రమాదం ఉందని, తమ ప్రభుత్వ హయాంలో సాధించిన అభివృద్ధిని కూటమి ప్రభుత్వ క్రెడిట్లో వేసుకుంటున్నారని ఎద్దేవ



చేశారు. ప్రభుత్వం తక్షణమే తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# యాత కులాన్ని ఎస్టీలో చేర్చాలి... అట్రాసిటీ యాక్టివ్ వర్తింప చేయాలి



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** ఉత్తరాంధ్రలో 6 లక్షల పై చిలుకు జనాభా కలిగిన యాత కులస్తులు అత్యంత వెనుకబడి ఉన్నారని, వారిని ఎస్టీలుగా గుర్తించి ఎస్టీ రిజర్వేషన్ అమలు చేయాలని జడ్జ్ కోర్టు జంక్షన్ వద్ద గల సర్దార్ గౌతుల లచ్చన్న విగ్రహం వద్ద ప్లకార్డులు ప్రదర్శన ఉత్తరాంధ్ర యాత సంక్షేమ అభివృద్ధి సేవా సంఘం అధ్యక్షుడు రాజు గౌడ్ యాత అందజేసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ. భారత శిక్షాస్మృతి 1860 ప్రకారం కుల వివక్షతకు గురువుతున్న మన రాష్ట్రంలో 32 అత్యంత వెనుకబడిన కులాలకు అట్రాసిటీ యాక్ట్ వర్తింపజేయాలని కోరినట్టు తెలిపారు. బిసి కులాల్లో ఒక కులమైన నాయి బ్రాహ్మణులకు కులం పేరు పెట్టి దూషించినా, కుల వివక్షత చూపించిన వారికి చట్టరీత్యా సెక్షన్ 1860 యాక్ట్ ప్రకారం శిక్షార్హులని, దీనికి సంబంధించిన జీవోను ప్రభుత్వం విడుదల చేయడంతో అన్ని వర్గాల నుండి హర్షం వ్యక్తం అయిందన్నారు. అదేవిధంగా ఎంబీసీ కార్పొరేషన్ లో ఉన్నటువంటి సంచార జాతులు అత్యంత దయనీయమైన పరిస్థితుల్లో కులం పేరు చెప్పుకోవడానికి సిగ్గుపడే పరిస్థితుల్లో, కుల దూషణ, కుల వివక్షతను అనుభవిస్తూ గ్రామాలకు, పట్టణాలకు సభ్య సమాజానికి వారంతట వారే వెళి వేసుకుంటూ బతుకుతున్న సంచార జాతులు సుమారుగా రాష్ట్రంలో 32 కులాలు వరకు ఉన్నాయని తెలిపారు. అత్యంత వెనుకబడిన కులాల్లో ఉన్న యాత కులానికి రానున్న రోజుల్లో అట్రాసిటీ యాక్ట్, 200 యూనిట్లు కరెంటు, గృహనిర్మాణ పథకంలో లక్ష రూపాయలు అదనంగా సంచారజాతుల బందు పథకం లాంటి స్కీమ్స్ ఎంబిసి సంచార జాతులకు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. రానున్న రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామని, వారికి అండగా నిలబడి, ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకు వచ్చి హక్కులు సాధిస్తామని, బిసి, ఎంబీసీ సంఘాల నుంచి సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. గెద్దాడ రమేష్ ఒడిసలా సూరి బాబు కడవల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# హెల్మెట్ లేదంటే జరిమానా రూ. 1000






**రేణిగుంట, (రాజధాని వార్తలు):** రేణిగుంట పట్టణం నందు గల అంబేద్కర్ కూడలి వద్ద రేణిగుంట అర్బన్ సీఐ జయ చంద్ర మరియు ఎస్ఐ ధర్మారెడ్డి మరియు పోలీసు సిబ్బంది ద్విచక్ర వాహనదారుల హెల్మెట్ ధారణపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులకు రేపటినుండి తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, లేదంటే పెట్రోల్ బంకులలో పెట్రోల్ ఇవ్వరనీ సీఐ స్పష్టం చేశారు. హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులకు 1000 రూపాయలు జరిమానా ఉంటుందని స్పష్టం చేశారు. అదేవిధంగా యువతకు దిశా నిర్దేశం చేస్తూ మీ ప్రాణాలు మీ కుటుంబ సభ్యులకు ఎంతో అవసరమని, మీరు ఏదైనా ప్రమాదానికి గురైనప్పుడు మీ కుటుంబం ఆర్థికంగా చిన్న భిన్నం అవుతుందనీ యువతకు తెలియజేశారు.

హెల్మెట్ ధరించడం వల్ల ప్రయోజనాలను ఈ సందర్భంగా సిఐ జయచంద్ర, ఎస్సై ధర్మారెడ్డి మరియు పోలీస్ సిబ్బంది ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు.

# ఇఫ్కో కిసాన్ సెజ్‌లో పరిశ్రమల స్థాపనకు ఆసక్తి చూపుతున్న పారిశ్రామికవేత్తలు

**- 800 కోట్ల పెట్టుబడితో ఫిబ్రవరిలో శంఖుస్థాపనకు సన్నాహాలు - ఇఫ్కో కిసాన్ సెజ్ లో పారిశ్రామిక అభివృద్ధికి రాష్ట కేబినెట్ లో చర్చ - బుచ్చిరెడ్డి పాళెంలో 8. 5 కోట్లతో మెయిన్ రోడ్డు పనులను త్వరలోనే ప్రారంభిస్తాం - ఇఫ్కో కిసాన్ సెజ్‌లో పరిశ్రమల స్థాపనతో కోవూరు నియోజకవర్గ నిరుద్యోగ సమస్యకు పరిష్కారం - ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి సారధ్యంలో కోవూరు నియోజకవర్గం అభివృద్ధి చెందుతుంది - బుచ్చిరెడ్డి పాళెం పట్టణంలో కర్మ కృతువుల భవన నిర్మాణానికి భూమిపూజ సందర్భంగా ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి**






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** మనిషి మరణించాక చేసే కర్మ కృతువులు ఆత్మీయత, అనుబంధాలకు నిదర్శనం అన్నారు ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి. బుచ్చిరెడ్డిపాళెం పట్టణం 12 వ వార్డులో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డితో కలిసి కైలాస భూమికి అనుసంధానంగా కర్మకాండలు నిర్వహించే భవన నిర్మాణ భూమి పూజ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. బుచ్చిరెడ్డి పాళెం పట్టణంలో శిథిలావస్థకు చేరిన కర్మ కృతువులు నిర్వహించే భవనం స్థానంలో నూతన భవన నిర్మాణానికి ఆయన 25 లక్షలు ఎంపి లాడ్స్ నిధులు కేటా యించారు. ఈ సందర్భంగా ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ కర్మ కృతువులు లాంటి అత్యవసర పనుల కోసం ఎంపి లాడ్స్ నిధులు అందచేయ డం చాలా సంతోషంగా వుందన్నారు. ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డితో కలిసి బుచ్చిరెడ్డిపాళెం పట్టణ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. బుచ్చి పట్టణ మెయిన్ రోడ్డు నిర్మాణానికి 8.5 కోట్లు మంజూర య్యాయని త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. ఇఫ్కో కిసాన్ సెజ్‌లో పరిశ్రమల స్థాపనకు పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపుతు న్నారని 800 కోట్ల పెట్టుబడితో రెండు మ్యాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్స్ ఫిబ్రవరిలో శంఖుస్థాపన చేసేందుకు సన్నాహాలు చేస్తు న్నట్టు పేర్కొన్నారు. ఇఫ్కో కిసాన్ సెజ్‌లో పారిశ్రామిక అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేస్తున్న కృషిని అభినందిస్తూ 2 వేల 700 ఎకరాలున్న ఇఫ్కో సెజ్‌లో పారిశ్రామిక అభివృద్ధి గురించి రాష్ట కేబినెట్‌లో చర్చ జరిగిన విషయాన్ని ఎంపి వేమిరెడ్డి ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఇఫ్కో కిసాన్ సెజ్ లో పరిశ్రమల స్థాపనతో కోవూరు నియోజకవర్గ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు అభిస్తాయనన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి చొరవను ఎంపీ వేమిరెడ్డి ప్రశంసించారు. ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి కోవూరు నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ప్రచారం సందర్భం గా గ్రామాలలో పర్యటిస్తున్నప్పుడు తాను గుర్తించిన ప్రధాన సమస్యల్లో స్మశాన వాటికల సమస్య ఒకటన్నారు. కోవూరు నియోజకవర్గంలో చాలా గ్రామాలలో ఇప్పటికి స్మశాన వాటికలు లేవని, కొన్నిచోట్ల కనీస మౌలిక సదుపాయాలు లేవన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచాక చాలా గ్రామాలలో స్మశాన వాటికలకు స్థల కేటాయింపులు ఎంపి వేమిరెడ్డి గారి సహకారంతో సి ఎస్ ఆర్ మరియు ఎంపి లాడ్స్ నిధులతో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నానన్నారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చాక బుచ్చి పట్టణంలో జరిగిన రోడ్లు, డ్రైన్లు తదితర అభివృద్ధి పనుల గురించి వివరించారు. బుచ్చి పట్టణంలోని ఇస్కపాళెం రోడ్డు మరియు మంగలి కట్ట ప్రాంతాలలోని స్మశాన వాటికలలో కాం పౌండ్ వాల్స్ తదితర మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానన్నారు.

గాంధీనగర్ ప్రాంతంలో నిర్మిస్తున్న కర్మ కృతువుల భవన నిర్మాణం త్వరతగతిన పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బుచ్చి పట్టణ మున్సిపల్ కమీషనర్ డి బాలకృష్ణ, ఛైర్ పర్సన్ మోర్ల సుప్రజ, టిడిపి సీనియర్ నాయకులు కోడూరు కమలాకర్ రెడ్డి, టీడీపీ గౌరవాధ్యక్షులు టంగుటూరి మల్లికార్జున్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు గుత్తా శ్రీనివాసరావు, వైస్ ఛైర్మెన్లు యరటపల్లి శివకుమార్ రెడ్డి, నస్రీన్ ఖాన్‌లతో పాటు కౌన్సిలర్లు, టీడీపీ యూనిట్, క్లస్టర్, బూత్ కమిటీ కన్వీనర్లు, బిజెపి, మరియు జనసేన నాయకులు పాల్గొన్నారు.

# ఆధునిక భారత అభివృద్ధి ప్రదాత అటల్ బీహార్ వాజ్ పేయి

**- జాతీయ రహదారులపై ప్రయాణం చేస్తుంటే వాజ్ పేయి గుర్తుకొస్తారు - వాజ్‌పేయి గారి జయంతిని దేశ వ్యాప్తంగా సుపరిపాలన దినోత్సవంగా ప్రకటించడం శుభపరిణామం - 11 సార్లు ఎంపిగా 3 సార్లు ప్రధానిగా సేవలందించిన భారతదేశం గర్వించతగ్గ నాయకులు - 50 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ జీవితంలో వాజ్‌పేయి ప్రతిపక్ష నేతగా, ప్రధానమంత్రిగా దేశానికి ఎంతో సేవ చేశారు - వాజ్ పేయిని ప్రధానమంత్రి చేయాలన్న ఏకైక లక్ష్యంతో నాడు చంద్రబాబు నాయుడు ఎన్డిఎ ఛైర్మన్ హెూదాలో జాతీయ స్థాయిలో ప్రతి పక్షాలను ఏకం చేశారు - సిఎం చంద్రబాబు నాయుడు ప్రధాని నరేంద్ర మోడి కాంబినేషన్లో రాష్టంలో అభివృద్ధి, సంక్షేమం సమపాళ్ళలో అమలవుతున్నాయి - నెల్లూరులో మాజీ ప్రధాని స్వర్గీయ అటల్ బిహారి వాజ్ పేయి విగ్రహావిష్కరణ సందర్భంగా వేమిరెడ్డి దంపతులు**







**నెల్లూరు, (రాజధాని వార్తలు):** మాజీ ప్రధాని, భారతరత్న స్వర్గీయ అటల్ బిహారీ వాజ్‌పేయి మరియు ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోడి. భారత రాజకీయాలలో సుపరి పాలనకు, అభివృద్ధికి చిరునామాలుగా నిలిచిన మహా నాయకులన్నారు ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి గారితో కలిసి ఆయన అటల్–మోడి సుపరిపాలన బస్సు యాత్ర పాటు నెల్లూరు నగరం ముత్తుకూరు బస్ స్టాండ్ వద్ద జరిగిన అటల్ బిహారి వాజ్ పేయి విగ్రహావిష్కరణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డితో మాట్లాడుతూ 50 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ జీవితంలో వాజ్‌పేయి ప్రతిపక్ష నేతగా, ప్రధానమంత్రిగా దేశానికి ఎంతో సేవ చేశారన్నారు. మాజీ ప్రధాని స్వర్గీయ అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతిని దేశ వ్యాప్తంగా సుపరిపాలన దినోత్సవంగా ప్రకటించడం శుభపరిణామం అన్నారు. అప్పట్లో ప్రధానిగా వాజ్‌పేయి ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు కాంబినేషన్‌ను తలపిస్తూ నేడు నరేంద్ర మోడి, చంద్రబాబుల సారథ్యంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందన్నారు. 18 ఏళ్ళ వయసులో క్విట్ ఇండియా ఉద్యమం ద్వారా రాజకీయా ల్లోనికి వచ్చిన వాజ్ పేయి 11 సార్లు ఎంపిగా 3 సార్లు ప్రధానిగా దేశానికి సేవలు అందించారన్నారు. ప్రతిష్టాత్మక స్వర్ణ చతుర్భుజి ప్రాజెక్ట్ ద్వారా దేశంలోని మహానగరాలైన ఢిల్లీ, కోల్‌కత్తా, చెన్నై మరియు ముంబాయి నగరాలకు రోడ్ కనెక్టివిటీ ఏర్పాటు చేసిన ఘనత వాజ్‌పేయిదేనన్నారు. వాజ్‌పేయి నిరాడంబరతకు మారు పేరని ప్రధాని హెూదాలో వుంటూ అప్పట్లో ఎన్డీఏ ఛైర్మెన్‌గా సలహాలు, సంప్రదింపులు చేసేవారని చంద్రబాబు నాయుడు తరచూ చెప్పే మాటలను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. అనంతరం ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ పరిపాలన దక్షతకు మారుపేరైన మహానాయకులు మాజీ అటల్ బిహారి వాజ్ పేయి, ప్రధాని నరేంద్ర మోడిల పేరిట తలపెట్టిన అటల్–మోడి సుపరిపాలన బస్సు యాత్రలో చాలా సంతోషంగా వుందన్నారు. భారతరత్న మాజీ ప్రధాని వాజ్‌పేయి అని ప్రధానమంత్రి చేయాలన్న ఏకైక లక్ష్యంతో నాడు చంద్రబాబు నాయుడు ఎన్డిఎ ఛైర్మన్ హెూదాలో జాతీయ స్థాయిలో ప్రతి పక్షాలను ఏకం చేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసారు. స్వర్గీయ అటల్ బిహారీ వాజ్‌పేయి ఆదర్శాలను నేటి తరానికి తెలియజేయడంతో పాటు రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి పార్టీల మధ్య ఐక్యతకు "అటల్–మోడి సుపరిపాలన బస్సు యాత్ర" దోహద పడుతుందన్నారు. అటల్ బిహారీ వాజ్‌పేయి గారి స్ఫూర్తితో ప్రధానమంత్రి నరేంద్ర మోడి దేశ వ్యాప్తంగా పేదలకు పక్కా ఇళ్ళు కట్టించే ప్రధాన మంత్రి ఆవాజ్ యోజన ఆరోగ్య రంగానికి సంబంధించి ఆయుష్మాన్ భారత్, రైతులకు పీఎం కిసాన్ సమ్మాన్ నిధి వంటి ఎన్నో సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టార న్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడి నాయకత్వంలో భారతదేశం "వికసిత భారత్" లక్ష్యం దిశగా అడుగులు వేస్తుందన్నారు. అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతిని పురస్కరించుకుని కూటమి పార్టీ నాయకులు "అటల్–మోడి సుపరిపాలన బస్సు యాత్ర"లో పాల్గొని మహానాయకులైన స్వర్గీయ అటల్ బిహారీ వాజ్ పేయికి ఘన నివాళులు అర్పించవలసిందిగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్. దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, బిజెపి రాష్ట అధ్యక్షులు మాధవ్, జిల్లాకు చెందిన ఎంపి, ఎమ్మెల్యేలు,జిల్లాకు చెంది బిజెపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా వడ్లతాంగల్ చెంగల్రాయరెడ్డి 6వ వర్ధంతి వేడుకలు

**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** వడ్లతాంగల్ చెంగల్రాయరెడ్డి పేదల పక్షపాతి అని ఆయన తనయుడు, ఏపీ బీసీ సంఘం రాష్ట అధ్య క్షులు వడ్లతాంగల్ బాలాజీ ప్రసాద్ రెడ్డి చెప్పారు. వడ్లతాంగల్ చెంగల్రాయరెడ్డి ఆరవ వర్ధంతి వేడుకలు శనివారం శ్రీకాళహస్తిలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయన చిత్రపటా నికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. చెంగల్రాయరెడ్డి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకున్నారు. ఈ సందరరేగా వడ్లతాంగల్ బాలాజీ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ తన తండ్రి వడ్లతాంగల్ చెంగల్రాయరెడ్డి ఎపుడూ పేదల గురించి ఆలోచించే వారన్నారు. పేదలకు సాయం చేస్తూ దయాగుణం చాటుకునే వారన్నారు. కష్టాల్లో ఉన్న వారు ఎవరు వచ్చినా వారికి సాయం చేయడం ఆయన గుణం అన్నారు. అందుకే తన తండ్రి చెంగల్రా యరెడ్డి శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ప్రత్యేక గుర్తింపు పొందా రన్నారు. తన ఇంటికి వచ్చిన పేదలకు ఆకలి తీర్చకుండా ఆయన పంపేవారు కాదన్నారు. అందుకే ఆయన వర్ధంతి రోజున వందలాది మంది పేదలకు అన్నదానం చేస్తున్నామన్నారు.



వర్ధంతి వేడుకలకు హాజరైన వారికి వడ్లతాంగల్ బాలాజీ ప్రసాద్ రెడ్డి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంజూరు తారక శ్రీనివాసులు, హేమభూషణ రెడ్డి, పఠాన్ ఫరీద్, మునికృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి కళారీ పట్టు పోటీలకు సెలెక్ట్ అయిన బకీరు లక్ష్మీదీపక్




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ఇటీవల విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి కళారీ పట్టు పోటీలలో మొదటి స్థానంలో గెలిచి జాతీయ స్థాయి కళారీ పట్టు పోటీలకు సెలెక్ట్ కాబడిన నా పెద్ద మరదలు ఉప్పలూరు భాగ్యలక్ష్మి కుమారుడు బకీరు లక్ష్మి దీపక్‌కు పెదనాన్న దూడల పెంచలయ్య, పెదమ్మ ఉప్పలూరు సరళ కుమారి, అక్క దూడల సౌమ్యశ్రీ, అన్నయ్య దూడల సోర్యేష్‌లు అభినందనలు తెలియజేస్తున్నాము. ఈ సందర్భంగా పెదనాన్న దూడల పెంచలయ్య మాట్లాడుతూ ఈ బాబు చిన్నప్పటినుండి చురుకైనా వాడు చదువు పట్లే కాకుండా ఇతర కార్యక్రమాలలో ఉత్సాహంగా పాల్గొంటాడు.

చిన్న వయసులోనే అంబేద్కర్ గారి జీవితచరిత్ర చదువుతూ ఆయన బడుగు బలహీన వర్గాలకు చేసిన సేవలు, రాజ్యాంగ రచన గురించి అందరిని అడిగి తెలుసు కొంటూ పుస్తకాలు చదువుతూ ఉంటాడు. ఈ అబ్బాయి తల్లి ప్రభుత్వ ఉద్యోగి ఉ పాధ్యాయ రాలు తండ్రి నాగేశ్వరరావు ప్రభుత్వ అధ్యాపకులు. బాబు ప్రస్తుతం 10వ తరగతి చదువు తున్నాడు మంచిమార్క్ లతోపాస్ అయ్యి స్పోర్ట్స్‌లో ఇంకా పెద్ద పెద్ద అవార్డులు పొంది ఉన్నత స్థాయికి చేరుకోవాలని దీవిస్తున్నాను.

# సంపాదకీయం

## మరో పదేళ్లకు నిశ్శబ్ద విప్లవానికి విజయమేనా

వాస్తవాలకూ భావాలకూ మధ్య సంబంధం ఎప్పుడూ సంక్లిష్టమైనదే. ఏదో కారణంతో ఎప్పుడో ఒకప్పుడు ఏర్పరచుకున్న భావాలను ఒకపట్టాన మార్చుకోలేం. వాస్తవాలు మారినప్పుడు వాటి ఆధారంగా ఏర్పడిన భావాలూ మారాలి. అదంత తేలికకాదనే సంగతి ఏ సమాజ చరిత్రను చూసినా అర్థమవుతుంది. భౌతిక, జీవ, రసాయన విజ్ఞానాల విషయంలో భావాలను మార్చుకోటానికి అందరమూ సంసిద్ధంగానే ఉంటాం. సామాజిక వాస్తవాల దగ్గరికి వచ్చేటప్పటికి అంతటి సంసిద్ధతను వ్యక్తంచేయలేం. అసలు కొన్ని సామాజిక వాస్తవాలను అంగీకరించటానికి కూడా మనం ఇష్టపడం. ప్రతిభ అనేది పూర్తిగా పుట్టుకతో రాదనీ దానికీ మనం అనుభవించే సామాజిక హోదాలకూ, లభ్యమయ్యే వెసులుబాట్లకూ సంబంధం ఉందంటే.. కాదని చెప్పేందుకు ఆధునిక, సనాతన సిద్ధాంతాలు చాలా ఉన్నాయి. సమాజ కట్టుబాట్ల కారణంగా కొన్ని సామాజిక వర్గాలు వివిధ రంగాల్లో వెనుకబడి ఉన్నాయన్న విషయాన్ని అంగీకరించని పరిస్థితి నిన్నమొన్నటివరకూ ఉండేది. అట్లాగే కొన్ని సామాజిక వర్గాలు ఇటీవల గణనీయంగానే ముందంజ వేస్తున్నాయంటే కాదని వాదించే పరిస్థితి ఉంది. మారుతున్న సామాజిక వాస్తవాలను పరిగణనలోకి తీసుకుని భావాలను సరిచూసుకోవటమూ, సరిదిద్దుకోవటమూ ఎంతో సంఘర్షణతో కూడుకున్నది. కష్టమైనా, నష్టమైనా ఆ సంఘర్షణను ఎల్లకాలమూ వాయిదా వేయలేం. మారుతున్న సామాజిక వాస్తవాలు ఏదోరూపంలో బలంగా ముందుకు తోసుకువస్తూనే ఉంటాయి. అవి పెట్టే రాపిడితో పాతకాలం నాటి వాస్తవాల ఆధారంగా ఏర్పరచుకున్న భావాలను మార్చుకోక తప్పనిసరి పరిస్థితి ఎదురవుతుంది. ఉన్నత విద్యారంగంలో అగ్రకులాలు అగ్రభాగాన ఉన్నారంటే ఎవ్వరికీ సందేహం రాదు. మన సామాజిక వాస్తవం అలాంటిది. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచీ 2011-12 సంవత్సరం వరకూ ఇదే పరిస్థితి ఉంది. జనాభాలో పావువంతుకు కాస్త అటు ఇటుగా ఉండే అగ్రకులాలకు చెందిన విద్యార్థులు ఉన్నత విద్యారంగంలో 57.1శాతం ఆనాటికి ఉన్నారు. ఆ తర్వాత పరిస్థితి మారింది. 2022%-%2023 సంవత్సరానికి వచ్చేటప్పటికీ మార్పు కొట్టొచ్చినట్లుగా కనపడింది. 2011-12 నాటికి ఉన్నత విద్యారంగంలో 42.9 శాతం మాత్రమే ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల సంఖ్య 2022-23కు వచ్చేసరికి 60.9 శాతానికి చేరింది. దీనికి భిన్నంగా మరో విచిత్రం కూడా జరుగుతోంది. ఉన్నత విద్యారంగంలో అగ్రకుల (ఓసీలు) విద్యార్థుల సంఖ్య తగ్గుతోంది. ఇదొక నమ్మలేని నిజం! 2011-12 పోల్చితే ఆ తర్వాత 13 ఏళ్లల్లో ఉన్నత విద్యారంగం బాగా విస్తరించింది. ఈ విస్తరణతో ఓసీ విద్యార్థుల సంఖ్య మొత్తంగా ఎంతోకొంత పెరగాలి. కానీ ఆ కాలంలో 11 లక్షల మంది ఓసీ విద్యార్థులు తగ్గారు. 2010-11లో 1.83 కోట్ల ఓసీ విద్యార్థులు ఉన్నత విద్యారంగంలో ఉంటే 2022-23 నాటికి ఆ సంఖ్య 1.72 కోట్లకు పడిపోయింది. ఓసీలకు మాత్రమే లబ్ధి చేకూర్చటానికి తీసుకు వచ్చిన 10శాతం ఈడబ్ల్యూసీ రిజర్వేషన్లు కూడా ఈ తరుగుదలను ఆపలేకపోయాయి. ఉన్నత విద్యారంగంలో మార్పులు ఆషామాషీవి కావు. సమాజంలో మారుతున్న బలాబలాలకు ఉన్నత విద్యారంగం ఎప్పుడూ బలమైన సూచికగానే ఉంటుంది. విద్యారంగానికి తోడు ఉద్యోగ రంగంలో కూడా సామాజికవర్గాల వారీ ఖచ్చితమైన గణాంకాలు సేకరించినప్పుడు ఇప్పటికే వచ్చిన మార్పులూ సమీప భవిష్యత్తులో రానున్న మార్పులూ స్పష్టంగా తెలుస్తాయి. ఇప్పటికైతే ఉద్యోగాల గురించి దేశవ్యాప్త సమాచారం లేదు. ఉన్నత విద్యారంగం గురించి మాత్రం అటువంటి సమాచారమూ, దాని విశ్లేషణా అందుబాటులో ఉంది. ఉదయ్‌పూర్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)కు సంబంధించిన 'సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్' విభాగం.. కేంద్ర విద్యాశాఖ ఏటా ప్రచురించే నివేదికలను విశ్లేషించి మారుతున్న సామాజిక చిత్రాన్ని మనకు అందించింది. కేంద్ర విద్యాశాఖ ప్రచురించే నివేదికలు ప్రజలకు అందుబాటులో ఉంటాయి కాబట్టి.. ఐఐఎంకు చెందిన ముగ్గురు అధ్యాపకులు వెంకటరామన్ కృష్ణమూర్తి, త్యాగరాజన్ జయరామన్, దీనా బెనర్జీలు అంకెల విషయంలో చాలా జాగ్రత్త వహించారు. పేజీపేజీకి అధికారిక అంకెలనూ వాటి మూలాలనూ స్పష్టంగా పేర్కొన్నారు. పదమూడు ఏళ్లలో దేశంలో రిజర్వేషన్ల శాతాల్లో పెద్దగా మార్పులు రాలేదు. వాటిని పెంచటానికి వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలు తీసుకువచ్చినా అవి కోర్టుల జోక్యంతో అమలు కాలేదు. ఈశాన్య ప్రాంతాలు, తమిళనాడు లాంటి ఒకటిరెండు పెద్ద రాష్ట్రాలు మినహా ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు 50శాతం రిజర్వేషన్లే అమలవుతున్నాయి. అంటే ఉన్నత విద్యారంగంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల విద్యార్థుల ఎదుగుదలకు ఆర్థిక పరిస్థితుల్లో వచ్చిన మార్పులే ప్రధాన కారణంగా చెప్పుకోవాలి. 50శాతం రిజర్వేషన్లు పక్కాగా అమలయ్యే ప్రభుత్వ, ఎయిడెడ్ ఉన్నత విద్యాసంస్థలకే ఈ ఎదుగుదల పరిమితం కాలేదు. ప్రభుత్వ సహాయం లభించని ప్రైవేటు రంగంలోని విద్యాసంస్థల్లోనూ అది స్పష్టంగా కనపడుతోంది. ప్రభుత్వ ఉన్నత విద్యాసంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల సంఖ్య 62.2 శాతం ఉంటే ప్రైవేటురంగంలో అది 60శాతంగా నమోదైంది. పోనీ ఈ వర్గాల విద్యార్థులు సంప్రదాయక కోర్సులైన బీఏ, ఎంఏ, బీకాం లాంటి వాటికే పరిమితమయితే దాన్ని ఒకరకంగా వెనుకబాటుగానే పరిగణించొచ్చు. కానీ పరిస్థితి అలా లేదు. బీటెక్ (48.2శాతం), బీఈ(60.5శాతం), ఎంటెక్ (63శాతం), ఎంబీఏ (51,2శాతం), ఎంబీబీఎస్ (44.7శాతం), ఎండీ (40శాతం) లాంటి కోర్సుల్లో కూడా ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల విద్యార్థుల ఎదుగుదల స్పష్టంగా కనపడుతోంది.

# తెలుగు వారి ఆత్మ గౌరవానికి ప్రతీక పొట్టి శ్రీరాములు




**విజయనగరం, (రాజధాని వార్తలు):** విజయనగరం జిల్లా కేంద్రంలో తెలుగు భాషా పరిరక్షణ సమితి అధ్యక్షులు సముద్రాల గురు ప్రసాద్ ఆధ్వర్యంలో వివిధ స్వచ్ఛంద సంస్థలు సంయుక్తంగా పొట్టి శ్రీరాములుకు ఘనంగా నివాళులర్పించారు. పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా కార్యక్రమంలో ముందుగా శ్రీశ్రీశ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయం వద్ద గల పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా అంజలి ఘటించారు. ఈ సందర్భంగా గురు ప్రసాద్ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీక, అని తన ఆశయ సాధనలో ప్రాణాలను అర్పించి అమర జీవిగా నిలిచారని పేర్కొన్నారు. మహాత్మా గాంధీ బోధించిన సత్యము అహింస హరిజన ఉద్ధరణ కోసం జీవితాంతం పొట్టి శ్రీరాములు కృషి చేశారని అన్నారు. కుసుమంచి ఫౌండేషన్ అధ్యక్షులు సుబ్బారావు మాట్లాడుతూ వివిధ సత్యాగ్రహ ఉద్యమాల్లో పాల్గొని పలుమార్లు పొట్టి శ్రీరాములు జైలు శిక్ష అనుభవించారని అన్నారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ డిప్యూటీ గవర్నర్ ముళ్ళపూడి సుభద్ర దేవి, సమితి కార్యదర్శి డాక్టర్ జక్కు రామకృష్ణ ,ప్రముఖ రంగస్థలం నటుడు దర్శకుడు, ఈపు విజయ్ కుమార్,వాకర్స్ క్లబ్ నాయకులు దేవరశెట్టి శ్రీరామ్ మూర్తి, వాసవి ఫౌండేషన్ అధ్యక్షులు వెంకట్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# 21న ఆదివారం జిల్లా వ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమం

**- 1,99,386 మంది చిన్నారులు లక్ష్యం - మిస్ అయిన వారికి 22, 23, 24 తేదీల్లో ఇంటింటి సర్వే : జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి**





**విజయనగరం, (రాజధాని వార్తలు):** జిల్లా వ్యాప్తంగా ఈ నెల 21న పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి ఆదేశించారు. అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి 5 ఏళ్లలోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలను వేయించాలని కలెక్టర్ సూచించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పల్స్ పోలియో కార్యక్రమంపై సంబంధిత అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 1,99,386 మంది పిల్లలకు 1171 పోలియో బూతుల్లో పల్స్ పోలియో చుక్కలను వేయడానికి ఏర్పాటు చేయాలన్నారు. వీటితో పాటు 20 ట్రాన్సిట్ బృందాలు, 66 సంచార బృందాలు అందుబాటులో ఉండాలన్నారు. మురికివాడలు, మత్స్యకార గ్రామాలు, వలస కార్మిక ప్రాంతాలు, నిర్మాణ స్థలాలు, ఇటుక బట్టీలు వంటి 125 హై రిస్క్ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అదేవిధంగా బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ఆస్పత్రులు, మేళాలు, బజార్లు, పర్యాటక ప్రాంతాలను కూడా కవర్ చేయాలని ఆదేశించారు. ఇందుకోసం రెండు లక్ష 43 వేలు పైగా డోసులు అవసరం అని, 56 కోల్డ్ చైన్ యూనిట్లు సిద్ధం చేసినట్లు వివరించారు. డిసెంబర్ 21న జరిగే పల్స్ పోలియో రోజున అన్ని బూతుల్లో పిల్లలకు పోలియో చుక్కలు వేయాలని, ఏదైనా కారణాల వలన ఆ రోజులు పోలియో చుక్కలు వేయించుకోలేని పిల్లల కొరకు డిసెంబర్ 22, 23, 24 తేదీల్లో ఇంటింటి సర్వే నిర్వహించి శత శాతం పోలియో చుక్కలు వేయటం పూర్తి చేయాలని ఆదేశించారు. పల్స్ పోలియో కార్యక్రమంలో సుమారు ఐదు వేల మంది సిబ్బంది (వైద్యాధికారులు, ఏ.యన్.యంలు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది, ఇతర సిబ్బంది) పాల్గొంటారని తెలిపారు. మండలాల లోని అన్ని గ్రామాలలో టామ్ టామ్ ద్వారా, విస్తృత ప్రచారం గావించాలని, పంచాయతీ కార్యదర్శిలు, తహసీల్దార్లు, ఎంపిడిఒలు భాగస్వామ్యం కావాలని కలెక్టర్ ఆదేశించారు. ఐసిడిఎస్ నుండి కార్యకర్తలు, మహిళా సంఘాల సభ్యులు, వేతనదారులు చురుకుగా పాల్గొనే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ఈ నెల 20వ తేదీ నాటికి పోలియో వాక్సిన్ కిట్లు బూత్ లకు చేరుకోవాలని ఆదేశించారు. ప్రతి తల్లి, తండ్రి తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించి, పోలియో రహిత సమాజంలో భాగ స్వామ్యం కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో డిఆర్ఒ మురళి, డిఎంహెచ్ఒ డా.జీవన రాణి, డిసిహెచ్ఎస్ డా.పద్మశ్రీ రాణి, డా.ఐసిడిఎస్ పీడీ విమల రాణి, ఇపిడిసిఎల్ ఎస్ఇ ఎం.లక్ష్మణరావు, మెప్మా పిడి చిట్టి రాజు, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఇంధన పొదుపు ప్రగతికి మార్గం

**- పట్టణంలో భారీ అవగాహనా ర్యాలీ : జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి**









**విజయనగరం, (రాజధాని వార్తలు):** ఇంధనాన్ని పొదుపు చేయడం ద్వారా ప్రగతికి మార్గం వేయవచ్చునని జిల్లా కలెక్టర్ ఎస్.రాం సుందర్ రెడ్డి అన్నారు. మనం పారిశ్రామికంగా అభివృద్ధి చెందాలంటే, ఖచ్చితంగా విద్యుత్‌ను పొదుపుచేయాల్సిన అవసరం ఉదని స్పష్టం చేశారు. ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్ తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ విజయనగరం పట్టణంలో సోమవారం నిర్వహించిన అవగాహనా ర్యాలీని కలెక్టరేట్ వద్ద జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఇంధన పరిరక్షణపై రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ ర్యాలీ సంతకాల వంతెన, ఆర్టిసి కాంప్లెక్స్ మీదుగా బాలాజీ జంక్షన్ వరకు సాగింది. ర్యాలీ ప్రారంభించిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఇంధన పొదుపు ఆవశ్యకతను వివరించారు. ఇంధనాన్ని ఎంత పొదుపు చేస్తే, అంత అదనంగా ఉత్పత్తి చేసినట్టేనని అన్నారు. ప్రస్తుతం అభివృద్ధి చెందుతున్న క్రమంలో రోజురోజుకూ విద్యుత్ డిమాండ్ పెరుగుతోందని చెప్పారు. అందువల్ల ప్రతీఒక్కరూ విద్యుత్ ఆదాపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. దీనికోసం విద్యుత్‌ను ఆదా చేసే 5 స్టార్ పరికరాలను వినియోగించాలని, అవసరమైనప్పుడే విద్యుత్ ఉపకరణాలను వినియోగించాలని సూచించారు. తమ ఇళ్లలోని విద్యుత్ వినియోగాన్ని ఆడిట్ చేసుకొని, వాడకాన్ని తగ్గించుకోవాలని కోరారు. విద్యుత్‌ను వృధా చేయొద్దని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎపిఈపిడిసిఎల్ ఎస్ఈ ఎం.లక్ష్మణరావు, ఈఈలు పి.త్రినాథరావు, జి.సురేష్ బాబు, బి.రఘు, ఏడిఈ కిరణ్‌కుమార్, డిఈలు, ఏఈలు, విద్యాశాఖ ఏడి అరుణజ్యోతి, పెద్దసంఖ్యలో విద్యుత్ సంస్థ ఉద్యోగులు, నెడ్‌క్యాప్ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అఖిలభారత సిఐటియు మహాసభలను జయప్రదం చేయాలి




**మక్కువ, (రాజధాని వార్తలు):** మండల కేంద్రంలో సిఐటియు నాయకులు సమావేశమై అఖిల భారత సిఐటియు నాయకుల ఆధ్వర్యంలో డిసెంబర్ 31 విశాఖపట్నంలో జరిగే సిఐటియు 18వ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలంటూ ఈ సందర్భంగా సిఐటియు జెండాను మండల కేంద్రంలో ఎగురవేశారు. అనంతరం వీఆర్ఏ జిల్లా కార్యదర్శి జి కృష్ణారావు మాట్లాడుతూ కార్మికుల మీద వివిధ రకాల లేబర్ చట్టాలను అమలు చేస్తూ కార్మికులను యాజమాన్యాలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు కట్టు బానిసలుగా చేతిలో పెట్టిన ప్రభుత్వ కార్యక్రమాలను వ్యతిరేకిస్తూ కార్మికులందరూ ఐక్యం కావాలని ఎన్నికల ముందు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి నేటికీ ఉద్యోగులకు కార్మికులకు హక్కుగా వచ్చే పిఆర్సి కమిటీ వేయలేదని ఉద్యోగులను అణగదొక్కి వారి హక్కులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని సమాన పనికి సమాన వేతనం కూడా ఇవ్వటం లేదని అనేక డిపార్ట్మెంట్లో కాం ట్రాక్ట్ ఔట్సోర్సింగ్ డైలీ వేజ్ ఉద్యోగులు సంవత్సరాలు తరబడి అదనపు బెనిఫిట్స్ లేక తక్కువ జీతాలకు పని చేస్తూ జీవితాలను వెళ్లదీస్తున్నారు. ప్రస్తుత కాలంలో నిత్యావసర ధరలు చూస్తే ఆకాశాన్ని అంటుతున్నాయి. కార్మిక వర్గాలకు కుటుంబాలను నెట్టుకు రావడమే పెను సవాలుగా మారుతుంది. ఇదే పరిస్థితి కొనసాగినట్లయితే కార్మికులను ఏకం చేసి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటాలకు సిఐటియు ఉద్యమిస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఏల జిల్లా సంఘ కార్యదర్శి జి కృష్ణారావు, వీఆర్ఏల మండల అధ్యక్షుడు పవన్, ఈశ్వరరావు, ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలను ఆదుకోవాలి

**- వైకాపా లీగల్ సెల్ కన్వీనర్ "కంది తిరుపతి నాయుడు"**



**గజపతినగరం, (రాజధాని వార్తలు):** తమిళనాడు రాష్ట్రం రామేశ్వరం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నలుగురు అయ్యప్ప భక్తులలో దత్తిరాజేరు మండలం కోరపు కొత్తవలస గ్రామానికి చెందిన ముగ్గురు, గజపతినగరం మం డలం మరుపల్లి గ్రామానికి చెందిన ఒకరు మృతి చెందిన విషయం విధితమే. ఈ ఘటనపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకపోవడం బాధాకరమని, మృతి చెందిన కుటుంబాలకు 15 లక్షలు ఆర్థిక సాయం అందించాలని మాజీ ఎంపీపీ, వైకాపా నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షుడు కంది తిరుపతినాయుడు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఇటువంటి ప్రమాదాలు జరిగేటప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలన్నారు. గజపతినగరం నియోజకవర్గ శాసనసభ్యులు అయిన రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మృతుల కుటుంబాలను ఓదార్చారే తప్ప ఆ కుటుంబాలకు ఆర్థిక సాయం కోసం ఒక మాటకూడా మాట్లాడకుండా వెళ్ళిపోయారని మృతుల కుటుంబ సభ్యులే బాధ వ్యక్తం చేయడం ఆవేదన కలిగిస్తుందన్నారు. మృతుల కుటుంబాలు నిరుపేదలని, వాళ్ళని ఆదుకునే బాధ్యత ప్రభుత్వానికి ఉందన్నారు. జిల్లా ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలతో మాట్లాడి మృతుల కుటుంబాలను ఆదుకో వాలని కోరారు.

# టాప్ బ్యూటీ ఇండస్ట్రీని వదిలేయడానికి కారణం?



టాలీవుడ్‌లో నరసింహుడు, అశోక్ లాంటి క్రేజీ చిత్రాల్లో నటించింది సమీరా రెడ్డి. వరుసగా రెండు సినిమాల్లో అవకాశం కల్పించాడు యంగ్ టైగర్ ఎన్టీఆర్. ఆ సమయంలో రూమర్ల గురించి తెలిసినదే. అదే సమయంలో మెగాస్టార్ చిరంజీవి సరసన జై చిరంజీవ చిత్రంలోను సమీరా నటించింది. అందమైన చిరునవ్వు, హావభావాలతో ఆకట్టుకునే సమీరా రెడ్డి తెలుగు, తమిళం, హిందీ పరిశ్రమల్లో కొన్నేళ్ల పాటు హవా సాగించింది. అయితే సమీరా రెడ్డి అనూహ్యంగా పరిశ్రమ నుంచి ఎగ్జిట్ అవ్వడం అభిమానులను చాలా ఆశ్చర్య పరిచింది. 2012లో కృష్ణం వందే జగద్గురుమ్‌లో ఒక పాటలో అతిథిగా కనిపించింది. కానీ ఆ తర్వాత తెలుగులో నటించలేదు. మూడు భాషల్లో సమీరా రెడ్డి సూపర్‌హిట్ సినిమాల్లో నటించినా, పరిశ్రమ నుంచి ఎగ్జిట్ అయింది. పెళ్లి తర్వాత పూర్తిగా ఫ్యామిలీ లైఫ్‌కి అంకితమై తిరిగి సినీపరిశ్రమకు రాలేదు. కొన్నేళ్లుగా చిత్ర పరిశ్రమకు దూరంగా ఉంది. సమీరా రెడ్డి ఇటీవల తన 47వ పుట్టినరోజును జరుపుకున్నారు. ఈ వేడుకలకు సంబంధించిన ఓ వీడియో ఇంటర్నెట్‌లో వైరల్‌గా మారుతోంది. ఈ బర్త్ డే వీడియో చూశాక సమీరా తిరిగి సౌత్‌లో నటిస్తుందా? అంటూ ఎన్టీఆర్ అభిమానులు సోషల్ మీడియాల్లో ప్రశ్నిస్తున్నారు. సమీరా ప్రస్తుతం ఏం చేస్తోంది? అంటూ ఆరాలు తీస్తున్నారు. నిజానికి కెరీర్ కొన్ని ఫ్లాపులతో నెమ్మదించాక, సమీరా రెడ్డి 2014లో వ్యాపారవేత్త అక్షయ్ వర్దేను వివాహం చేసుకుంది. మరుసటి సంవత్సరం (2015) ఒక కుమారుడు జన్మించాడు. 2019లో ఒక కుమార్తె కూడా జన్మించింది. అటుపై పూర్తిగా పిల్లలు, భర్త కుటుంబానికే అంకితమైంది కానీ తిరిగి నటనలోకి రాలేదు. పిల్లల్ని కనే సమయంలో తన రూపం పూర్తిగా మారిపోవడంతో సమీరా రెడ్డి తీవ్రమైన డిప్రెషన్‌కి గురయ్యానని తెలిపారు. గర్భధారణ సమయంలో భావోద్వేగాల గురించి కూడా అభిమానులతో ముచ్చటించారు. ప్రస్తుతం సమీరా తన ఇద్దరు పిల్లలు, కుటుంబంతో సంతోషంగా ఉంది. సోషల్ మీడియాలో రీల్స్ చేస్తూ అభిమానులను అలరిస్తోంది. ఇక సమీరా నటిగా జోరు మీద ఉన్న సమయంలో లాక్మే వంటి టాప్ బ్రాండ్స్‌కి ప్రమోషన్స్ చేసింది. ముంబైలో ర్యాంప్ వాక్ లతో బిజీ బిజీగా గడిపేది.

ఇటీవల ఫ్యాషన్ షోలకు కూడా సమీరా దూరమైపోయింది. అయితే సమీరా అందమైన రూపం, చిరునవ్వును ఆరాధించిన అభిమానులు ఇప్పటికీ తనను మర్చిపోలేరు. సమీరా రెడ్డి ప్రస్తుతం గోవాలోని పోర్వోరిమ్‌లో నివసిస్తోంది. ఇటీవల ఫిట్‌నెస్ ఫ్రీక్‌గా తనను తాను ప్రమోట్ చేసుకుంటోంది. 2026లో ఈ భామ తిరిగి నటనలోకి ఆరంగేట్రం చేయాలని భావిస్తోందిట. ప్రస్తుతం చిమ్నీ అనే హారర్-థ్రిల్లర్ చిత్రంలో నటిస్తోంది. ఈ సినిమా వచ్చే ఏడాది విడుదల కానుందని సమాచారం.

# పూరి తర్వాత ఆ రికార్డు అనీల్ దే!



టాలీవుడ్‌లో అత్యంత వేగంగా సినిమా చిత్రీకరణ పూర్తి చేసి రిలీజ్ చేసిన ఘనత ఎవరిది? అంటే అంతా డ్యాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ పేరు చెబుతారు. ఆయన డిక్షనరీలో రెండు మూడు నెలల్లోనే షూటింగ్ పూర్తి చేసిన సినిమాలెన్నో ఉన్నాయి. సెట్స్‌కు వెళ్లిన తర్వాత చకాచకా షూటింగ్ చుట్టేయడం అన్నది పూరి ప్రత్యేకత. ఆర్టిస్టుల టైమ్ ఎక్కువగా తీసుకోడు. సినిమాలో ఎంత మంది పెద్ద ఆర్టిస్టులున్నా ఎలాంటి ఒత్తిడికి గురి కాకుండా డీల్ చేయగలడు. అమితాబ్ బచ్చన్‌లాంటి లెజెండరీనే పెట్టుకుని సినిమా తీసాడంటే పూరి ఎంతటి పని వంతుడో చెప్పాల్సిన పని లేదు. పూరి సినిమాల్లో పెద్దగా సెట్స్ కూడా ఉండవు. వీలైనంత వరకూ రోడ్డు, స్టూడియోల్లోనే షూటింగ్ చుట్టేస్తాడు. అవసరమైతే పాటలకు సెట్స్ వేస్తాడు తప్ప లేదంటే ఆ ఖర్చు కూడా నిర్మాతకు ఉండదు. సినిమాకు పబ్లిసిటీ ఖర్చు కూడా పెద్దగా ఉండదు. అది నిర్మాతల ఇష్టం మేరకు వదిలేస్తారు. మరి ఇదే తరహాలో సినిమాలు చేసే మరో డైరెక్టర్ ఎవరు? అంటే హిట్ మెషిన్ అనీల్ రావిపూడి పేరు చెప్పొచ్చు. పూరి విధానంలోనే అనీల్ కూడా వేగంగా షూటింగ్ పూర్తి చేయగల దర్శకుడు. ప్రారంభోత్సవం అనంతరం పెద్దగా సమయం తీసుకోడు. సెట్స్‌కి వెళ్లిన తర్వాత ఆర్టిస్టుల డేట్లను బట్టి షూటింగ్ చుట్టేస్తాడు. అదనంగా డేట్లు తీసుకుని నిర్మాతపై భారం వేయడు. కథకు అవసరమైతే ఎంతైనా ఖర్చు చేయిస్తాడు. అందులోనూ వీలైనంత తక్కువలోనే సీన్ పూర్తి చేసేలా చూస్తాడు. దీనికి సంబంధించిన అనీల్ రెండు రకాల ప్లాన్‌లు ముందుగానే సిద్ధం చేసి పెట్టుకుంటాడు. షూటింగ్ పూర్తి చేసిన చిత్రాన్ని అంతే వేగంగాను రిలీజ్ చేయగల సమర్థుడు. 15 ఏళ్ల కెరీర్‌లోనే ఎనిమిది సినిమాలు చేసాడు. వాటి రిలీజ్ విషయంలో ఎక్కడా జాప్యం జరగలేదు. సాధారణంగా పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో కొంత ఆలస్యం జరుగుతుంటుంది. అక్కడా కూడా అనీల్ ఎంతో తెలివిగా ప్లాన్చేసి ముందుకెళ్తాడు. తాను తీసిన కంటెంట్‌ని జనాల్లోకి తీసుకెళ్లడంలోనూ అంతే సమర్థుడు. ప్రచారం పరంగా నిర్మాతకు కోట్ల రూపాయలు ఆదా చేయగల దర్శకుడు కూడా. సినిమా పూర్తి చేయడం ఓ ఎత్తైతే ఆ ప్రోడక్ట్‌ని జనాల్లోకి తీసుకెళ్లడానికి ప్రచారం పేరుతో కోట్లు ఖర్చు చేయిస్తారు. కానీ అనీల్ ఇక్కడ ఎంతో స్మార్ట్‌గా ఆలోచిస్తాడు. ప్రచారం కోసం సినిమాలో నటీనటుల్నే తెలివిగా వినియోగించుకుంటాడు. ఈ విషయంలో సందర్భాన్ని బట్టి రకరకాల వ్యూహాలు వేస్తుంటాడు. మన శంవకర ప్రసాద్ గారు విషయంలో ప్రచారమంటే దూరంగా ఉండే నయనతారనే ఒప్పించి పని చేయించాడు. ఆ సినిమా ప్రారంభానికి ముందే ప్రీ లాంచ్ ప్రమోషన్ ఎలా చేసాడో తెలిసిందే. చిరంజీవి, నయనతారలాంటి స్టార్లనే రంగంలోకి దించి ప్రచారం చేయించాడు. ఇక రిలీజ్ సమయంలో అదే టీమ్‌తో ప్రచారం ఏ రేంజ్‌లో నిర్వహిస్తాడో చెప్పాల్సిన పనిలేదు.

# మెగా సినిమాను మర్చిపోయారేంటి..?




మెగాస్టార్ చిరంజీవి రెండేళ్ల క్రితం మొదలు పెట్టిన విశ్వంభర సినిమా ఇప్పటికీ పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుపుకుంటుంది. ఈ సినిమాను వశిష్ట డైరెక్ట్ చేస్తున్నారు. చిరు చేసిన జగదేక వీరుడు అతిలోక సుందరి తరహాలోనే ఈ విశ్వంభర ఉంటుందని చెప్పుకుంటున్నారు. విశ్వంభర సినిమాలో త్రిష హీరోయిన్‌గా నటిస్తుంది. సినిమాలో మీనాక్షి చౌదరి, ఆషిక రంగనాథ్ కూడా నటిస్తున్నారు. కీరవాణి మ్యూజిక్ అందిస్తున్న ఈ సినిమాలో సాంగ్స్ కూడా ఆకట్టుకునేలా ఉంటాయని అంటున్నారు. అసలైతే ఈ ఇయర్ సంక్రాంతికే విశ్వంభర రిలీజ్ చేయాల్సి ఉన్నా అది కాస్త వాయిదా పడుతూ వచ్చింది. ఐతే సినిమాలో ఎక్కువ వి.ఎఫ్.ఎక్స్ వర్క్ ఉన్న కారణంగా వాటి గురించి ఆడియన్స్ నుంచి నెగిటివిటీ వస్తుందన్న భావనతో మరింత శ్రద్ధతో గ్రాఫిక్స్ వర్క్ చేయిస్తున్నారు. సినిమాను 2026 సంక్రాంతికి అనుకున్నారు ఫైనల్‌గా నెక్స్ట్ సమ్మర్‌కి సినిమా రిలీజ్ ఫిక్స్ చేశారు. సంక్రాంతికి చిరంజీవి మన శంకర వరప్రసాద్ వస్తుంది. ఐతే ఈ సినిమా కన్నా ఎప్పుడో మొదలైన విశ్వంభర కనీసం మినిమం బజ్‌ని కూడా తెచ్చుకోలేకపోతుంది. విశ్వంభర మీద కామన్ ఆడియన్స్ కాదు మెగా ఫ్యాన్స్ కూడా అంత ఆసక్తిగా లేరన్నట్టు పరిస్థితి కనిపిస్తుంది. సినిమా గ్లింప్స్ రిలీజ్ చేసినా దానికి కూడా నామమాత్రంగానే రెస్పాన్స్ వచ్చింది. విశ్వంభర ఫ్యాన్స్‌ని ఎంగేజ్ చేసే స్టఫ్.. విశ్వంభర సినిమా సమ్మర్ రిలీజ్ ఉంది. అయినా కూడా ఆడియన్స్‌ని ఎంగేజ్ చేసేలా మేకర్స్ నుంచి ఎలాంటి అప్డేట్స్ బయటకు రావట్లేదు.

విశ్వంభర సినిమా విషయంలో ఎందుకు ఈ విధంగా జరుగుతుంది అన్నది తెలియాల్సి ఉంది. ఐతే సినిమా కథను హింట్ ఇస్తూ త్వరలో సినిమా నుంచి ఒక టీజర్ వస్తుందట. అది సినిమాపై అంచనాలు పెంచేస్తుందని అంటు న్నారు. మరి విశ్వంభర సినిమా నిజంగానే ఫ్యాన్స్‌ని ఎంగేజ్ చేసే స్టఫ్‌తో వస్తుందా లేదా అన్నది సినిమా వస్తేనే తెలుస్తుంది. ఐతే ఈ సినిమాపై మెగా బాస్ మాత్రం చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నారని తెలుస్తుంది. అడ్వెంచర్ కథతో విజువల్ ఫీస్ట్ ఎక్స్‌పీరియన్స్ అందించేందుకు విశ్వంభర వస్తుంది. విశ్వంభర బజ్ పెంచి సినిమాపై ఆడియన్స్‌లో ఇంట్రెస్ట్ కలిగించేలా మేకర్స్ ప్రమోషనల్ యాక్టివిటీస్ చేయాల్సి ఉంది. అయితే ఎలాగు మన శంకర వప్రసాద్ రిలీజ్ ఉంది కాబట్టి ఆ సినిమా రిలీజ్ తర్వాత విశ్వంభర ప్రమోషన్స్ స్టార్ట్ చేసే ఛాన్స్ ఉందని చెప్పొచ్చు. ఈ సినిమాతో త్రిష ఆఫ్టర్ లాంగ్ ఇయర్స్ తెలుగు రీ ఎంట్రీ ఇస్తుంది. ఒకప్పుడు తెలుగులో స్టార్ హీరోలతో నటించిన ఈ అమ్మడు ఈమధ్య పూర్తిగా తమిళ సినిమాలకే అంకితమైంది.

# పెళ్లి వార్తలపై ఫైర్ అయిన మెహరీన్



2016లో నాని హీరోగా వచ్చిన కృష్ణగాడి వీర ప్రేమగాథ సినిమాతో టాలీవుడ్‌కు హీరోయిన్‌గా పరిచయమయ్యారు పంజాబీ బ్యూటీ మెహరీన్. తక్కువ టైమ్ లోనే పలు సినిమాల్లో నటించిన మెహరీన్ ఆ తర్వాత ఎఫ్2లో వరుణ్ తేజ్‌కు జోడీగా నటించి ఆ సినిమాలో హనీ ఈజ్ ది బెస్ట్ అనే డైలాగ్‌తో ఆడియన్స్‌ను ఆకట్టుకున్న మెహరీన్ హీరోయిన్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. గతంలో భవ్య బిషోయ్‌తో ఎంగేజ్‌మెంట్ అయితే 2021 మార్చిలో హర్యానాకు చెందిన భవ్య బిషోయ్‌తో ఎంగేజ్‌మెంట్ జరిగింది. బీజేపీ తరపున అడంపూర్ అసెంబ్లీకి బిషోయ్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కానీ కొన్ని తెలియని కారణాల వల్ల వీరిద్దరి ఎంగేజ్‌మెంట్ క్యాన్సిల్ అవడంతో పెళ్లి రద్దైంది. ఇక్కడ వరకు అంతా బాగానే ఉంది కానీ గత కొన్నాళ్లుగా మెహరీన్ పెళ్లి మరో వ్యక్తిని పెళ్లి చేసుకున్నారని వార్తలొస్తున్నాయి. ఈ వార్తలపై తాజాగా మెహరీన్ స్పందిస్తూ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. తనకసలు పరిచయమే లేని వ్యక్తితో పెళ్లి జరిగిందని వార్తలు రాయడంపై ఆమె మండిపడుతూ, గత రెండేళ్లుగా ఇలాంటి విషయాలపై మౌనంగానే ఉన్నానని, కానీ ఇప్పుడు రెస్పాండ్ అవక తప్పడం లేదని చెప్తూ ఈ మేరకు మెహరీన్ తన సోషల్ మీడియాలో ఓ నోట్‌ను రిలీజ్ చేశారు. నేను ఫలానా వ్యక్తిని పెళ్లి చేసుకున్నట్టు వార్తలు రాస్తున్నారు. కానీ నేనెవరినీ పెళ్లి చేసుకోలేదు, ఫ్యూచర్‌లో పెళ్లి చేసుకోవాలని డిసైడ్ అయినప్పుడు ఆ విషయాన్ని స్వయంగా నేనే ప్రపంచానికి తెలియ చేస్తా. దయ చేసి నా పెళ్లి గురించి ఎలాంటి ప్రచారాలు చేయొద్దని ఆమె విజ్ఞప్తి చేశారు. ఇక కెరీర్ విషయానికొస్తే ఎఫ్3 తర్వాత మెహరీన్ స్పార్క్ అనే తెలుగు సినిమా చేశారు. మధ్యలో ఓ వెబ్ సిరీస్ కోసం ఎక్కువ టైమ్ కేటాయించడం వల్లే కెరీర్లో గ్యాప్ వచ్చిందని, తాను కావాలని గ్యాప్ తీసుకోలేదని చెప్పిన మెహరీన్ ప్రస్తుతం కన్నడలో ఓ సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

# డ్రోన్ టెక్నాలజీపై వారం రోజుల వర్క్‌షాప్ ప్రారంభం

## - విద్యార్థులు ప్రయోగాత్మక జ్ఞానం పెంపొందించుకోవాలి : వీసీ ఆచార్య అల్లం శ్రీనివాసరావు











**నెల్లూరు, (రాజధాని వార్తలు):** విక్రమ సింహపురి యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో "డ్రోన్ టెక్నాలజీ" అంశంపై నిర్వహించనున్న వారం రోజుల జాతీయ స్థాయి వర్క్‌షాప్ సోమవారం రోజున విశ్వవిద్యాలయంలో ఘనంగా ప్రారంభమైంది. వర్క్‌షాప్‌ను ప్రారంభించిన వీసీ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య అల్లం శ్రీనివాసరావు జ్యోతి ప్రజ్వలన చేసి వర్క్‌షాప్‌ను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత సాంకేతిక యుగంలో డ్రోన్ టెక్నాలజీ ప్రాధాన్యత రోజురోజుకూ విస్తరిస్తోందని తెలిపారు. డ్రోన్‌లు కేవలం వినోదానికి మాత్రమే కాకుండా వ్యవసాయం, రక్షణ రంగం, వైద్య సేవలు, విపత్తుల నిర్వహణ వంటి కీలక రంగాల్లో విస్తృతంగా వినియోగంలో ఉన్నాయని అన్నారు. విద్యార్థులు పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా ఇలాంటి వర్క్‌షాప్‌ల ద్వారా ప్రయోగాత్మక జ్ఞానాన్ని పెంపొందించుకొని జాతీయ స్థాయిలో ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. కర్నూలులో రాబోయే డ్రోన్ సిటీని దృష్టిలో పెట్టుకొని, అందులోని అవకాశాలను సద్వినియోగం చేసుకోవడంతో పాటు నైపుణ్యమయిన శ్రామికశక్తిని తీర్చిదిద్దే ఉద్దేశంతో డ్రోన్స్ మరియు IoT విభాగాల్లో M.Sc ప్రోగ్రామ్‌ను ప్రారంభించాలని కంప్యూటర్ సైన్స్ విభాగ ఫ్యాకల్టీకి వైస్ ఛాన్సలర్ ఆదేశించారు. సిలబస్ రూపకల్పన, ల్యాబ్‌ల స్థాపనకు IIITDM కర్నూలు సహకారంతో చర్యలు చేపడుతున్నామని కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ ఆండే ప్రసాద్ తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచే డ్రోన్స్ మరియు IoT లో కొత్త పీజీ ప్రోగ్రామ్‌ను ప్రారంభించేందుకు విశ్వవిద్యాలయం ప్రణాళికలు సిద్ధం చేస్తోందని ఆయన వెల్లడించారు. పరిశోధనలు, భద్రత – ఉపాధి అవకాశాలపై ప్రసంగించిన డాక్టర్ కె.కృష్ణ నాయక్ (డిపార్ట్మెంట్ ఆఫ్ ECE, IIITDM కర్నూల్) మాట్లాడుతూ, డ్రోన్ టెక్నాలజీలో జరుగుతున్న పరిశోధనలు దేశ భద్రత, వ్యవసాయ ఆధునికీకరణ, స్మార్ట్ సిటీస్ అభివృద్ధికి ఎంతో ఉపకరిస్తున్నాయని తెలిపారు. డ్రోన్‌ల ఉపయోగం: పంటల ఆరోగ్య విశ్లేషణ, నీటి వనరుల మ్యాపింగ్, ట్రాఫిక్ మానిటరింగ్, సరిహద్దు పర్యవేక్షణ వంటి పనులను తక్కువ ఖర్చుతో, తక్కువ సమయంలో చేయవచ్చన్నారు. నైపుణ్యాలు: విద్యార్థులు డ్రోన్ హార్డ్‌వేర్ డిజైన్, ఎంబెడెడ్ సిస్టమ్స్, కమ్యూనికేషన్ ప్రోటోకాల్స్‌లో నైపుణ్యం సాధిస్తే పరిశ్రమల్లో మంచి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. అవగాహన తప్పనిసరి: డ్రోన్ టెక్నాలజీలో భద్రత, DGCA మార్గదర్శకాలు, ఫ్లైట్ పర్మిషన్లు, నో–ఫ్లై జోన్లపై అవగాహన తప్పనిసరిగా ఉండాలని సూచించారు. అకడమిక్ పరిశోధనను పరిశ్రమ అవసరాలతో అనుసంధానించడం ద్వారా విద్యార్థులు ఉద్యోగావకాశాలతో పాటు స్టార్టప్‌ల స్థాపన వైపు కూడా ముందడుగు వేయగలరని అన్నారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే. సునీత మాట్లాడుతూ, కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధునిక సాంకేతికతపై ఇలాంటి వర్క్‌షాప్‌ను నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు.

శిక్షణ అంశాలు: కార్యక్రమ కోఆర్డినేటర్ ఆచార్య అందే ప్రసాద్ మాట్లాడుతూ, వారం రోజుల పాటు జరిగే ఈ వర్క్‌షాప్‌లో నిపుణులచే కింది అంశాలపై శిక్షణ అందించనున్నట్లు తెలిపారు.

డ్రోన్ల తయారీ విధానం, మెకానిజం, ఫ్లైట్ కంట్రోలర్ ప్రోగ్రామింగ్, సెన్సార్ల పనితీరు, ముఖ్యంగా, డ్రోన్ల నియంత్రణలో కోడింగ్ ప్రాముఖ్యత. ఈ ప్రారంభోత్సవంలో విషయ నిపుణులు డాక్టర్ కె నాగరాజు, డిపార్ట్మెంట్ ఆఫ్ CS&E, డాక్టర్ యం .నరేష్ బాబు, డిపార్ట్మెంట్ ఆఫ్ CS&E, డాక్టర్ రవి కుమార్ మండవ డిపార్ట్మెంట్ ఆఫ్ ME, IIITDM కర్నూల్. వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సిహెచ్. విజయ, Co-Coordinators Dr Maligela Ussenaiah, Dr G.Vijaya Lakshmi, Dr N.O Gopal, వివిధ విభాగాల డీన్‌లు, అలాగే వివిధ కళాశాల విద్యార్థులు, వర్సిటీ విద్యార్థులు మరియు పరిశోధక విద్యార్థులు 100 మంది పాల్గొన్నారు.

# "నెల్లూరు వైకాపా ర్యాలీ గ్రాండ్ సక్సెస్"









**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ, జిల్లాలోని 11 నియోజకవర్గాల్లో వైయస్సార్సీపీ ప్రజల నుండి సేకరించిన సంతకాలను వేలాదిగా తరలి వచ్చిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో నెల్లూరు నగరంలో భారీ ర్యాలీ నిర్వహించి, సంతకాల పత్రాల వాహనాన్ని జెండా ఊపి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయం తాడేపల్లికి పంపిన మాజీ మంత్రివర్యులు మరియు ఉమ్మడి నెల్లూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి. కార్యక్రమానికి హాజరైన జిల్లా పరిషత్ చైర్మన్ ఆనం అరుణమ్మ శాసన మండలి సభ్యులు పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, మేరీగ మురళీధర్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పరిశీలకులు జంకే వెంకట రెడ్డి మాజీ మంత్రి పోలుబోయిన అనిల్ కుమార్ యాదవ్ మాజీ శాసనసభ్యులు మేకపాటి విక్రమ్ రెడ్డి కిలివేటి సంజీవయ్య నెల్లూరు రూరల్, ఉదయగిరి, వెంకటగిరి నియోజకవర్గాల ఇంఛార్జీలు ఆనం విజయకుమార్ రెడ్డి, మేకపాటి రాజగోపాల్ రెడ్డి నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి, వైకాపా రాష్ట్ర మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజిత, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీఈసీ సభ్యులు పేర్నాటి శ్యామ్ ప్రసాద్ రెడ్డి యస్ ఈసీ సభ్యులు కొండ్రెడ్డి రంగా రెడ్డి, అనుబంధ సంఘాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. మహాత్మా గాంధీ విగ్రహానికి, మహానేత వై.యస్.రాజశేఖర్ రెడ్డికి పూలమాలలు వేసి, నివాళులర్పించి, కార్యక్రమాన్ని ప్రారంభించిన వైయస్సార్సీపీ శ్రేణులు. గాంధీ బొమ్మ సెంటర్ నుండి బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించి, అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించిన అనంతరం జెండా ఊపి, కోటి సంతకాల పత్రాల వాహనాన్ని వైయస్సార్సీపీ కేంద్ర కార్యాలయానికి పంపిన జిల్లా అధ్యక్షులు కాకాణి. నెల్లూరు జిల్లా చరిత్రలో కనివిని ఎరుగని రీతిలో భారీగా తరలివచ్చిన ప్రజలకి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు, ర్యాలీ గ్రాండ్ సక్సెస్‌కు కారకులైన వారందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేసిన కాకాణి. కోటి సంతకాల పత్రాల వాహనం వెంట జాతీయ రహదారి వరకు ర్యాలీగా వెళ్లి, కేంద్ర కార్యాలయానికి సాగనంపిన కాకాణి, పర్వతరెడ్డి, తదితరులు. పేద విద్యార్థులకు వైద్య విద్యను అందించడంతోపాటు, పేద కుటుంబాలకు వైద్యాన్ని అందించాలనే లక్ష్యంతో జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఆంధ్ర రాష్ట్రానికి 17 మెడికల్ కళాశాలలను మంజూరు చేయించారు. జగన్మోహన్ రెడ్డి లక్ష్యానికి చంద్రబాబు తూట్లు పొడుస్తున్నాడు. పూర్తయ్యే దశలో ఉన్న 10 మెడికల్ కళాశాలలను చంద్రబాబు ప్రైవేటీకరణ చేయాలనే నిర్ణయం తీసుకోవడం దుర్మార్గం. జగన్మోహన్ రెడ్డి అధికారం లేకపోయిన ప్రజా ప్రయోజనాల కోసం నిబద్ధతతో వ్యవహరిస్తుంటే, చంద్రబాబు మాత్రం తనకు స్వార్థ ప్రయోజనాలే ముఖ్యం అన్నట్లు ప్రవర్తిస్తున్నాడు. చంద్రబాబు తీసుకున్న ప్రైవేటీకరణ నిర్ణయానికి నిరసనగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అనేక నిరసన కార్యక్రమాలు చేపట్టింది. జిల్లాలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు, ప్రజలు, విద్యార్థులు, విద్యార్థి సంఘాలు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యావేత్తలు, ప్రజా సంఘాలు, పౌర సంఘాలు, వివిధ పార్టీల నాయకులు పాల్గొని జయప్రదం చేశారు. జిల్లాలో పార్టీలకతీతంగా రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించడంతో పాటు, ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన అనేక కార్యక్రమాల్లో రాజకీయాలకతీతంగా పాల్గొని తమ సందేశాలను అందించిన ప్రముఖులు అందరికీ ధన్యవాదాలు. జగన్మోహన్ రెడ్డి పిలుపునిచ్చిన కోటి సంతకాల కార్యక్రమంలో నెల్లూరు జిల్లాలోని 11 నియోజకవర్గాల నుండి 7 లక్షల సంతకాలను సేకరించారు. సేకరించిన సంతకాలను వేలాదిమంది ప్రజలతో భారీ ర్యాలీ నిర్వహించి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయానికి పంపుతున్నాం. వేలాదిగా తరలివచ్చిన కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతిఒక్కరికీ పేరు పేరున హృదయపూర్వక ధన్యవాదాలు.

వైకాపా మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజిత స్క్రోలింగ్ పాయింట్స్:

కూటమి ప్రభుత్వంపై ప్రజలకు ఉన్న వ్యతిరేకత కోటి సంతకాల కార్యక్రమం ద్వారా స్పష్టంగా అర్థమవుతుంది. కోటి సంతకాల కార్యక్రమంలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని, సంతకాలు పెట్టి చంద్రబాబు నిర్ణయాన్ని వ్యతిరేకించారు. కూటమి ప్రభుత్వం పాలనలో విఫలమైంది. కూటమి ప్రభుత్వంలో మహిళలతో పాటు, ఏ ఒక్క వర్గానికి న్యాయం దొరకడం లేదు. జగనన్నకు మంచి పేరు రాకూడదనే ఉద్దేశ్యంతో చంద్రబాబు మెడికల్ కళాశాలలను ప్రైవేట్‌పరం చేస్తున్నారు. ప్రజల వ్యతిరేకతను చూసైనా ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనుకకు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం.

# వాజ్ పేయికి సోమా పద్మరత్నం వినూత్న నివాళి





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరులోని హరనాథపురం సెంటర్‌లో భారతరత్న, మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్ పేయి కాంస్య విగ్రహా ఆవిష్కరణ సోమవారం ఘనంగా జరిగింది. అటల్, మోడీ సుపరిపాలన యాత్రలో భాగంగా బిజేపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్, మంత్రులు సత్యకుమార్, ఆనం రామ నారాయణరెడ్డి, ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఇతర బిజేపి నేతలు ఈ కార్యక్రమానికి విచ్చేసి నూతనంగా ఏర్పాటు చేసిన వాజ్ పేయి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. మరో వైపు వాజ్ పేయి కాంస్య విగ్రహా ఆవిష్కరణ కార్యక్రమాన్ని పురస్కరించుకుని సూక్ష్మ కళా చిత్రకారుడు మరియు వీరంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు పండిట్ సోమా పద్మరత్నం వాజ్ పేయికి వినూత్నంగా నివాళి అర్పించారు. రావి ఆకుపై వాజ్ పేయి చిత్రాన్ని రూపొందించారు. అలాగే ఆపిల్, బత్తాయి పండ్లపై కూడా వాజ్ పేయి చిత్రాన్ని చిత్రీకరించి, ఆయనపై తన అభిమానాన్ని చాటుకున్నారు. అంతేకాకుండా రావి ఆకుపై ప్రధాని నరేంద్ర మోడీ చిత్రాన్ని కూడా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సోమా పద్మరత్నం మాట్లాడుతూ భారతదేశ అభివృద్ధిలో వాజ్ పేయి పాత్ర చరిత్రలో లిఖించదగిందన్ని కొనియాడారు. స్వర్ణ చతుర్భుజి పథకం ద్వారా చెన్నై నుండి నెల్లూరుకు నాలుగు లైన్ల జాతీయ రహదారిని నిర్మించిన ఘనత వాజ్‌పేయిదని అన్నారు. జాతీయ రహదారి నిర్మాణం ద్వారా వాజ్‌పేయిని నెల్లూరు ప్రజలు చిరకాలం స్మరించుకుంటారని పేర్కొన్నారు. వాజ్ పేయి స్ఫూర్తిగా ప్రధాని నరేంద్ర మోడీ భారతదేశానికి ప్రపంచ స్థాయి గుర్తింపును తీసుకొస్తున్నారని, వాజ్‌పేయి విగ్రహం నెల్లూరులో ఏర్పాటు చేసినందుకు ధన్యవాదాలు తెలియజేశారు.

# అమరజీవి పొట్టి శ్రీరాములు కారణజన్ములు : వేమిరెడ్డి దంపతులు

## - పొట్టి శ్రీరాముల గారి త్యాగ ఫలితంగానే ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది - కుల వివక్ష, అంటరానితనంపై అలుపెరుగని పోరాటం చేసిన సంఘ సంస్కర్త - త్యాగాలకు చిరునామాగా మారిన పొట్టి శ్రీరాములు ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తి కావాలి





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం ప్రాణ త్యాగం చేసి అమరజీవిగా చరిత్రికెక్కిన పొట్టి శ్రీరాములు గారి త్యాగం చిరస్మరణీయం అన్నారు వేమిరెడ్డి దంపతులు. పొట్టి శ్రీరాములు గారి వర్ధంతి సందర్భంగా బుచ్చిరెడ్డి పాళెం పట్టణంలోని చెన్నూరు రోడ్డులో ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిలు అమరజీవి విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఎంపి ప్రభాకర్ రెడ్డి పొట్టి శ్రీరాముల గారి త్యాగ ఫలితంగానే ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందన్నారు. తెలుగువారి ఆత్మ గౌరవం కోసం 1952 లో నాటి మద్రాసు నగరంలో 58 రోజుల నిరాహార దీక్ష ప్రాణ త్యాగం చేసిన పొట్టి శ్రీరాములు గారి మహెూన్నత వ్యక్తిత్వాన్ని ఆయన కొనియాడారు. అనంతరం ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అమరజీవి పొట్టి శ్రీరాములు గారి అసాధారణ త్యాగం, ఆయన నిబద్ధతలను ప్రశంసించారు. గాంధీ గారి ప్రేరణతో ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని జైలుకు వెళ్ళడానికి కూడా వెనుకాడని శ్రీరాములు గారి ధీరత్వాన్ని ఆమె కొనియాడారు. కుల వివక్ష, అంటరానితనంపై అలుపెరుగని పోరాటం చేసిన సంఘ సంస్కర్తగా పొట్టి శ్రీరాములు గారిని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి అభివర్ణించారు. త్యాగాలకు చిరునామాగా మారిన ఆయన ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తి కావాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఈ కార్యక్ర మంలో బుచ్చి పట్టణ మున్సిపల్ ఛైర్ పర్సన్ మోర్ల సుప్రజ, టిడిపి సీనియర్ నాయకులు కోడూరు కమలాకర్ రెడ్డి, ఎంవి శేషయ్య, టీడీపీ గౌరవాధ్యక్షులు టంగుటూరి మల్లికార్జున్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు గుత్తా శ్రీనివాసరావు. వైస్ ఛైర్మెన్లు యరటపల్లి శివకుమార్ రెడ్డి, నస్రీన్ ఖాన్‌లతో పాటు కౌన్సిలర్లు, టీడీపీ యూనిట్, క్లస్టర్, బూత్ కమిటీ కన్వీనర్లు, బిజెపి, మరియు జనసేన నాయకులు పాల్గొన్నారు.

# చట్ట ప్రకారం విచారణ జరిపి న్యాయం చేస్తాం : జిల్లా యస్.పి. అజిత వేజెండ్ల, ఐపియస్






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** జిల్లా పోలీసు కార్యాలయం నందు నిర్వహించిన 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమంలో 114 ఫిర్యాదులు స్వీకరణ. వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫిర్యాదుదారులను మాట్లాడించి, వారికి తక్షణమే ఉపశమనం కలిగించే విధంగా తగిన చర్యలు తీసుకున్న జిల్లా యస్.పి. ప్రజా ఫిర్యాదుల పట్ల అలసత్వం ఉండరాదు.. ప్రజలతో జవాబుదారీగా వ్యవహరించి పిటీషన్లను పరిష్కరించాలని ఆదేశాలు. 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి, చట్టపరిధిలో పరిష్కారం చూపాలని పోలీసు అధికారులను ఆదేశించిన జిల్లా యస్.పి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాదిదారులతో జిల్లా యస్.పి. స్వయంగా మాట్లాడి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి మొత్తం 114 ఫిర్యాదులు వచ్చాయి. వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని.. 1. ఆత్మకూరు పరిధికి చెందిన వ్యక్తికి, వాట్స్ యాప్ ద్వారా పరిచయమై, ఆన్ లైన్‌లో బిట్ కాయిన్ ట్రేడింగ్‌లో ఇవేస్ట్ చేయడం ద్వారా అధిక నగదు సంపాదించవచ్చని ఆశ చూపి, 11,65,771/- పెట్టుబడి పెట్టించి, నగదు తిరిగి ఇవ్వకుండా మోసం చేశారని, మోసపోయానని విచారించి న్యాయం చేయాలని కోరారు. 2. ఇందుకూరుపేట పరిధికి చెందిన మహిళ, తన ఇద్దరు కుమారులకు ఆస్తి పంపకాలన్నీ సమానంగా చేసినట్లు, తమ నివాసం కొరకు చిన్న ఇంట్లో ఉంటున్నట్లు, తన పెద్ద కుమారుడు కోడలు ఆ ఇంటిని కూడా ఇవ్వాలని ఇంటి నుండి వెళ్లిపోవాలని తనని, తన భర్తను బెదిరిస్తూ మానసికంగా వేధిస్తున్నారని విచారించి న్యాయం చేయాలని కోరారు. 3. రాపూరు పరిధికి చెందినటువంటి మహిళ యొక్క కుమార్తెకు పెళ్లి చేసినట్లు, గత మూడు నెలల నుండి భర్తతో వివాదాల కారణంతో పుట్టింట్లో ఉన్నట్లు, ఒకటిన్నర నెల క్రితం తన భర్త బాధలు భరించలేక ఇంటి నుండి ఎక్కడికో వెళ్లిపోయిందని ఆచూకీ కనుగొని అప్పగించాలని కోరారు. 4. కలువాయి పరిధికి చెందినటువంటి వ్యక్తిని, అదే ప్రాంతానికి చెందిన కండె ప్రసాద్ మరి కొంత మంది కలిసి తన పొలం విషయంలో కొట్టి, వేధించినట్లు, గతంలో కేసు నమోదు చేసి ఉన్నట్లు, అయినప్పటికీ తన పొలం సాగుచేసుకోనీకుండా ఇబ్బంది పెడుతున్నారని, విచారించి న్యాయం చేయాలని కోరారు. 5. వెంకటాచల సత్రం పరిధికి చెందినటువంటి మహిళను, తన భర్త అత్తమామలు అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని, అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని, తన జీవనాధారం కూడా కష్టంగా ఉందని అదేవిధంగా బిట్రగుంట పరిధికి చెందిన మహిళ యొక్క భర్త మరణాంతరం తన అత్త ఆడపడుచులు కొట్టి ఇంటి నుండి తరిమివేశారని, తనకు ముగ్గురు ఆడపిల్లలని, జీవనాధారం కూడా కష్టంగా ఉందని, విచారించి న్యాయం చేయాలని కోరారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సంధర్భంగా జిల్లా యస్.పి. అజిత వేజెండ్ల, ఐపియస్ హామీ ఇచ్చారు. ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా యస్.పి. ఎస్‌బి డిఎస్పీ శ్రీనివాసరావు లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులు రెడ్డి, డిసిఆర్‌బి సిఐ రామారావు, మహిళా స్టేషన్ సిఐ సుబ్బారావు, వెల్ఫేర్ ఆర్ఐ రాజారావు మరియు కంప్లైంట్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

# నెల్లూరు నగరంలో కనీ విని ఎరుగని రీతిలో కోటి సంతకాల ప్రజా ఉద్యమ ముగింపు ర్యాలీ

## - గాంధీ బొమ్మసెంటర్ నుంచి వీఆర్సీ సెంటర్ వరకు సాగిన ర్యాలీకి భారీగా తరలి వచ్చి బ్రహ్మరథం పట్టిన వేలాది మంది ప్రజలు - ప్రభుత్వ వైద్యం పేదవాడి హక్కు అన్న నినాదాలతో హోరెత్తిన రహదారులు










**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు గాంధీ బొమ్మ సెంటర్‌లో కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమ కార్యక్రమ ముగింపు ర్యాలీ వేలాది మంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజల మధ్య ఉత్సాహంగా సాగింది. ఈ కార్యక్రమానికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి వైఎస్ఆర్సిపి నెల్లూరు సిటీ ఇన్‌చార్జ్ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్తలు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. మొదట గాంధీ విగ్రహానికి నేతలు పూలమాల వేసి నివాళి అర్పించి అనంతరం వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి నివాళులర్పించి ర్యాలీని ప్రారంభించారు. గాంధీ బొమ్మ సెంటర్ నుంచి ప్రారంభమైన కోటి సంతకాల ప్రజా ఉద్యమ ర్యాలీకి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు ప్రజలు భారీ సంఖ్యలో హాజరై బ్రహ్మరథం పట్టారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేయొద్దు.. ప్రభుత్వ వైద్యం ప్రజల హక్కు అన్న నినాదాలతో ప్రజలు రహదారులను హోరెత్తించారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలు ప్రైవేటుకు ఇవ్వద్దు ప్రభుత్వమే కొనసాగించాలని కార్యకర్తలు నినాదాలు చేస్తూ పెద్ద ఎత్తున ప్లకార్డ్లు ప్రదర్శిస్తూ నిరసన తెలియజేశారు. ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ గత రెండు నెలలుగా ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల ప్రజా ఉద్యమ కార్యక్రమాన్ని..వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్విరామంగా కొనసాగించామని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి వెళ్ళి ప్రజల నుంచి సంతకాలు సేకరించడం జరిగిందన్నారు.

ఈ కోటి సంతకాల ప్రజా ఉద్యమ కార్యక్రమానికి పార్టీలకు అతీతంగా ప్రజలు తమ ముందుకొచ్చి తమ మద్దతు తెలియజేశారని అన్నారు. ప్రభుత్వ వైద్యం పేదవాడి హక్కు అని దానిని ప్రైవేటుపరం చేయడాన్ని ఈ రోజు ప్రతి ఒక్కరూ ఖండిస్తున్నారని అన్నారు. జిల్లాలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఏ కార్యక్రమం చేపట్టిన ప్రజలు అద్భుత విజయాన్ని అంది స్తూ యావత్తు రాష్ట్ర మొత్తం జిల్లా వైపు చూసేలే చేస్తున్నారని అన్నారు. ఈరోజు కోటి సంతకాల ప్రజా ఉద్యమంలో భాగంగా జిల్లావ్యాప్తంగా 7 లక్షల మంది ప్రజలు ముందుకొచ్చి సంతకాలు చేసి ప్రజా ఆకాంక్షను ప్రభుత్వానికి తెలియజేయడం అభినందనీయమన్నారు.

ఈరోజు కూడా కోటి సంతకాల ప్రజా ఉద్యమ ముగింపు ర్యాలీకి పోలీసులు ఎన్ని ఆంక్షలు పెట్టినప్పటికీ వేలాదిమంది ప్రజలు స్వచ్ఛందంగా తరలి రావడం చూస్తుంటే మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ప్రజలు ఎంత పెద్ద ఎత్తున వ్యతిరేకిస్తున్నారో అర్థమవుతుందన్నారు. కొన్ని వేల మంది ప్రజలతో ఈరోజు గాంధీ బొమ్మ సెంటర్ నుంచి వీఆర్సీ సెంటర్ వరకు కోటి సంతకాల ప్రజా ఉద్యమం ముగింపు కార్య క్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్ర మంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేస్తుందన్నారు. రాబోయే రోజుల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రజా సమస్యల పట్ల ఇదే స్ఫూర్తితో ముందుకెళ్తామని తెలియజేశారు. అనంతరం వీఆర్సీ సెంటర్లో నెల్లూరు జిల్లా వ్యాప్తంగా సేకరించిన కోటి సంతకాల పత్రుల వాహనాన్ని జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాజీ మంత్రి పోలుబోయిన అనీల్ కుమార్ యాదవ్ మరియు వైఎస్ఆర్సిపి సమన్వయకర్తలు, నేతలు, కార్యకర్తలతో కలిసి జెండా ఊపి వైసిపి కేంద్ర పార్టీ కార్యాలయానికి పంపించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎస్పీ మేడం పనిచేయని ఎస్సైని మేము ఎన్ని రోజులు భరించాలి అంటున్న మండల ప్రజలు

## - సైదాపురం మండలంలో ఆవులు మాయం చేస్తున్న దొంగల ముఠా - ఫిర్యాదులు ఇస్తున్నా పట్టించుకోని పోలీసులు - మామూళ్ల మత్తులో కాసుల కక్కుర్తిలో చేయి తడిపితే చాలు పశువులు ఆటోలకు రైట్ రైట్ - ఇప్పటికే చాగణం, లింగ సముద్రం, తిప్పిరెడ్డిపల్లి తదితర గ్రామాల రైతులు ఆవులు చోరీ













**నెల్లూరు, (రాజధాని వార్తలు):** మైనింగ్ మాఫియా అడవుల్లో కూడా రాత్రి పూట కనిపించేలా,ఏదైనా అలికిడి వస్తేనే అలారం మోగేలా అత్యాధునిక కెమెరాలు వందల సంఖ్యలో ఏర్పాటు చేసి ఉంటే ప్రజల భద్రత కోసం సైదాపురంలో ప్రధాన కూడళ్ళలో సీసీ కెమెరాలు ఎందుకు పనిచేయవు? ఆవులు దొంగలు సమాచారం పోలీసులకు ఇచ్చినా పట్టించుకోవడం లేదంటున్న రైతులు. లింగసముద్రానికి చెందిన ఓ గిరిజనుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటే సైదాపురం ఎస్సై నిర్వాహకంతో మృతదేహం కోసం రెండు రోజులు గిరిజనులు పడిగాపులు. చివరకు మూడు రోజులు తర్వాత కుళ్ళిన స్థితిలో మృతదేహం తీసుకెళ్లిన గిరిజనులు. ఇప్పటికే అనేక ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎస్సైపై జిల్లా ఎస్పీ మేడం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు అంటున్న స్థానిక మండల ప్రజలు. ఎస్సై వివాదాస్పద వ్యవహారంతో కూటమి పార్టీకి చెడ్డపేరు వస్తుందని ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వస్తుందని సాక్షాత్తు వెంకటగిరి నియోజక వర్గం ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఈ ఎస్సై మాకొద్దు బదిలీ చేయండి అంటూ పోలీసు ఉన్నతాధికారులకు సిఫారసు లేఖలు ఇచ్చినా ప్రయోజనం శూన్యమేనా అంటున్న రాజకీయ నాయకులు, కేవలం మైనింగ్ వ్యవహారం కోసం మోకాలు అడ్డుతున్న బయటి వ్యక్తుల వల్ల టిడిపి పార్టీకి చేటు అంటున్న స్థానిక నేతలు. ఈరోజు నెల్లూరు జిల్లా సైదాపురం మండలం లింగ సముద్రానికి చెందిన రామయ్య అనే రైతు సైదాపురం ఎస్సై పై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు, బాధితుడు తెలిపిన సమాచారం మేరకు తమ పశువులు పోయాయని సైదాపురం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు ఇచ్చినా పట్టించుకోవడంలేదని తమ పశువులను తీసుకెళ్లిన దొంగల సమాచారం ఎస్సైకి ఇచ్చినా అసలు పట్టించుకోవడంలేదని తిప్పిరెడ్డిపల్లి గ్రామంలో తమ ఆవు పోయాయని దానికి సంబంధించిన సమాచారం ఎస్సైకి తెలియజేస్తే తమతో పాటు అవతల వారిని పిలిపించారు. కానీ ఎటువంటి చర్యలు తీసుకోలేదని వ్యవహారాన్ని గోల్మాల్ చేస్తున్నాడని ఇదే సమయంలో సైదాపురం ఎస్ఐ నిర్వాహకంతో గిరిజనులు మూడు రోజుల పాటు మృతదేహం కోసం వేచి ఉండేలా చేశారని మరి కొన్ని సంచలన విషయాలను రామయ్య బయటపెట్టారు,, ఇటీవల లింగసముద్రం గ్రామం గిరిజన కాలనీకి చెందిన యాదగిరి శివరాజా అనే 30 సంవత్సరాల వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నం చేసుకోవడంతో మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించగా నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం పొందుతూ మరణించాడని అనంతరం మృతదేహాన్ని గిరిజన కాలనీకి తీసుకువచ్చేందుకు పోస్టుమార్టం కోసం సైదాపురం పోలీసులు ఇంక్వెస్ట్ రాయవలసిన అవసరం రావడంతో ఆసుపత్రి వారు తాము సైదాపురం ఎస్సైకు సమాచారం అందించినా రాలేదని చెప్పడంతో తాము కూడా ఎస్సైకి సమాచారం ఇచ్చామని ఎస్సై ఇప్పుడు కుదరదు సిబ్బంది లేరు ఇప్పుడు రాలేము అంటూ మూడు రోజులపాటు కాలయాపన చేశాడని దీంతో మృతదేహం కోసం మూడు రోజులపాటు ఎదురు చూడవలసి వచ్చిందని చివరకు గిరిజన యువకుడి మృతదేహం కుళ్ళిన స్థితిలోనే తాము తీసుకువస్తుంటే దుర్వాసన వచ్చిందని గిరిజనులు తమ గోడును స్థానికులు తెలిపినట్టు ప్రజలకు న్యాయం చేయని ఎస్సై తమకు ఎందుకని స్థానిక ప్రజలు తెలుపుతున్నట్టు రామయ్య తెలిపారు. సభ్య సమాజం తలదించుకునేలా ఇంత దారుణంగా సొంత వ్యక్తిని పోగొట్టుకుని చివరికి చివరి చూపుకోసం మృతదేహాన్ని తీసుకు వచ్చేందుకు కూడా మూడు రోజుల సమయం వేచి చూశారంటే ఇంత కంటే దారుణమైన పరిస్థితి ఉంటుందా అసలు ఇలాంటి పరిస్థితి ఎవ్వరికీ ఎదురు కాకుడదు ఇప్పటికైనా జిల్లా ఎస్పీ ఈ దారుణ ఘటనపై విచారణ చేసి సైదాపురం ఎస్సైపై చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాలు, గిరిజన సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call
9440662699, rajadhanivartalu.com

## EDUCATIONAL
- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

## HOSPITALS
- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యం.ఎ. రెహామాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

## MATRIMONIAL
- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్: 1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబంధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

## REAL ESTATE
- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

## NGO's
- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ టి.రమేష్, మంగళగిరి 0863-999999

## RESTAURENTS
- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

## COMPANIES
- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎక్ట్రానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్స్ కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి ప్రాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్సపోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# సాయి ప్రభుత్వం రెండేళ్లు : తన సొంత కోటలో చిక్కుకున్న విష్ణుదేవ్ సాయి - దివాకర్ ముక్తిబోధ్, సీనియర్ జర్నలిస్టు

(మొదటి పేజీ తరువాయి)

గత రెండు సంవత్సరాలుగా, సౌరభ్ ప్రభుత్వం కొన్ని రంగాలలో గణనీయమైన అపఖ్యాతిని ఎదుర్కొంది. గత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొన్ని ఉత్తమ పథకాలకు పేరు మార్చి, కొత్త రూపాన్ని ఇచ్చారు. మరియు వాటి అమలు మందకొడిగా సాగుతోంది. అదేవిధంగా కొత్త ఉపాధ్యాయుల నియామకం, ఆరోగ్య శాఖలో కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ లేదా పేదల కోసం ప్రధానమంత్రి గృహనిర్మాణ పథకం వంటి అనేక పథకాల విషయంలో వాస్తవ పరిస్థితి చాలా భిన్నంగా ఉంది. విద్యుత్ ధరలు పెంచి గత ప్రభుత్వం అందించిన సబ్సిడీలను సగానికి తగ్గించినప్పుడు సామాన్య ప్రజలే మొదటగా దెబ్బతిన్నారు. ఐదు సెంట్లు అంతకంటే తక్కువ విస్తీర్ణం ఉన్న భూ ప్లాట్ల రిజిస్ట్రేషన్‌ను నిషేధించి, రుసుములను పెంచినప్పుడు ఇటీవల రెండో దాడి జరిగింది. ప్రభుత్వం ఈ విషయాన్ని పునఃపరిశీలిస్తున్నప్పటికీ, దాని ప్రతిష్టకు జరగాల్సిన నష్టం అప్పటికే జరిగిపోయింది. ఇవన్నీ పక్కన పెడితే, బస్తర్‌లో నక్సలిజం మరియు నక్సలైట్లను నిర్మూలించే ప్రచారం వెనుక కేంద్ర ప్రభుత్వ స్వప్రయోజనాలు ఉన్నాయని కూడా విస్తృతంగా చర్చ జరుగుతోంది. బస్తర్‌ను నక్సలైట్ల నుండి విముక్తం చేయడం ద్వారా గిరిజనులను తీవ్రవాదం మరియు దోపిడీ బారి నుండి విముక్తి చేస్తున్నారని చెబుతున్నప్పటికీ, అభివృద్ధి పేరుతో అదానీ వంటి పారిశ్రామికవేత్తలకు సహజ వనరులను దోచుకోవడానికి పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. బొగ్గు నిక్షేపాలలో మైనింగ్ కోసం అడవులను నాశనం చేయడానికి వ్యతిరేకంగా పోరాటం నెలల తరబడి కొనసాగుతోంది. ప్రజా ఉద్యమాలు, నిరసనలు జరుగుతున్నాయి.

కానీ ఇవి ప్రభుత్వ పై ఎటువంటి ప్రభావాన్ని చూప లేదు. మార్చి 2026 నాటికి బస్తర్‌ను నక్సల్స్ రహితంగా మారుస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రతిజ్ఞ చేశారు. ఈ ప్రచారం ఖచ్చితంగా విజయవంతమైంది, కానీ అంతకు మించి, మోడీ-షా-సాయి ప్రభుత్వం రాబోయే మూడు సంవత్సరాలలో బస్తర్‌ను ఎలా మారుస్తుందో చూడాలి. తయారు చేస్తున్న అభివృద్ధి ప్రణాళిక గిరిజనులకు ఆమోదయోగ్యంగా ఉంటుందా? వారి సంస్కృతి, సంప్రదాయాలను జీవించే అంశంపై గిరిజనులు, మతం మారిన గిరిజనుల మధ్య కొనసాగుతున్న వివాదం భవిష్యత్ ప్రమాదానికి సంకేతం. రాజకీయ, సామాజిక దృక్కోణాల నుండి, వర్గాల మధ్య పరస్పర సామరస్యం, ఐక్యతను కొనసాగిం చడం షా ప్రభుత్వ బాధ్యత. బస్తర్‌పై హోంమంత్రి అమిత్ షాకు ఉన్న అభిమానం అందరికీ స్పష్టమైంది. డిసెంబర్ 13న జరిగే బస్తర్ ఒలింపిక్స్ ముగింపు వేడుకకు ఆయన ముఖ్య అతి థిగా హాజరవుతున్నారు. వచ్చేసారి ఆయన బస్తర్‌లోని ఏదైనా చిన్న పట్టణం లేదా గ్రామంలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటే ఆశ్చర్యపోనవసరం లేదు. విష్ణుదేవ్ సాయిది నిరాడంబరమైన వ్యక్తి, కానీ అతను తన సొంత కోటలో ఖైదీ. ముగ్గురు మాజీ ముఖ్యమంత్రులు - దివంగత అజిత్ జోగి, డాక్టర్ రమణ్ సింగ్ మరియు భూపేశ్ బాఘేల్ - వారి రాజకీయ శైలులు లేదా పాలనా పద్ధతులు ఏమైనప్పటికీ, సామాన్య ప్రజలతో కనెక్ట్ అయ్యే అవకాశాన్ని ఎప్పుడూ వదులుకోలేదు. వారు మీడియాకు కూడా సులభంగా అందుబాటులో ఉండేవారు. అయితే, విష్ణు దేవ్ సాయి విషయంలో అలా కాదు. మీడియా అయినా, సాధారణ పౌరులైనా, ముఖ్యమంత్రిని ఆయన నివాసంలో కలవడానికి గొప్ప ప్రయత్నం చేయాలి.

ఇప్పటివరకు ఆయన పదవిలో ప్రవర్తనను బట్టి చూస్తే, ఆయన తన స్థానం గురించి పెద్దగా ఆందోళన చెందుతున్నట్లు కనిపించడం లేదు. బహుశా ఆయన ఎప్పుడూ ఈ పదవిని మొదటగా కోరుకోకపోవడం వల్ల కావచ్చు. కేంద్ర నాయకత్వం నుండి ఏమీ అడగనప్పటికీ ఆయన సరళత, వినయం, పార్టీ పట్ల అచంచలమైన విధేయత, స్వాభావిక నిజా యితీ, ఉన్నత మాధ్యమిక స్థాయి వరకు విద్య మరియు వివాదా స్పదం కాని, నిరాడంబరమైన గిరిజన నాయకుడిగా ఆయన ఖ్యాతి నుండి ఆయన అపారమైన ప్రయోజనం పొందారు. ఆయన రాజకీయ ఆశయాలు ఎప్పుడూ మితిమీరినవి కావు. ఆయన సంపూర్ణ సంతృప్తి చెందారు మరియు ఐదు సంవత్సరాలు ముఖ్యమంత్రిగా కొనసాగుతారని తెలుసు. గిరిజన నాయకుడు కావడంతో ఆయనను పదవి నుంచి తొలగించే ప్రశ్నే తలెత్తదు. ఈ అవగాహన చాలావరకు నిజమే, అయినప్పటికీ రాజకీయాల్లో ఏమి జరుగుతుందో ఎవరూ ఊహించలేరు. అయితే రాబోయే మూడు సంవత్సరాలలో ప్రభుత్వం ఎలా పనిచేస్తుందనే దానితో సంబంధం లేకుండా, రిమోట్ కంట్రోల్ ద్వారా నడిచినప్పటికీ, ముఖ్యమంత్రిగా ఆయన కొనసాగడం పార్టీకి మరియు ఛత్తీస్‌గఢ్‌లో వివిధ ప్రయోజనాలను నెరవేర్చాల్సిన కేంద్ర నాయకత్వానికి ప్రయోజనకరంగా ఉంటుంది. ప్రభుత్వ పథకాలు మరియు అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల గురించి, అవి అమలు చేయబడుతున్నాయి. కానీ వాటి పురోగతి మరియు పని నాణ్యతను అంచనా వేయడానికి ప్రభుత్వానికి వ్యవస్థ లేదు. ప్రభుత్వం కూడా దీని గురించి పట్టించుకోనట్లు అనిపిస్తుంది. అన్ని విభాగాలలో గందరగోళం ఉంది. కానీ ఆరోగ్య రంగంలో పరిస్థితి అత్యంత దారుణంగా ఉంది. వార్తా పత్రికలలో మరియు సోషల్ మీడియాలో ఏదైనా స్కామ్ లేదా మరొకటి వార్తలు రాకుండా ఒక్క రోజు కూడా గడవదు. భూపేష్ బాఘేల్ ప్రభుత్వంలో పెద్ద అవినీతి కుంభకోణాలు వెలుగులోకి వచ్చాయి మరియు అరెస్టులు కూడా జరిగాయి, కానీ అవినీతి వ్యవస్థను పూర్తిగా నిర్మూలించడం ఏ ప్రభుత్వానికి అసాధ్యం, ముఖ్యంగా ప్రభుత్వంలోని చాలా మంది చిన్న మరియు పెద్ద అధికారులు అవినీతిలో మునిగిపోయినప్పుడు. అందువల్ల, ఈ విషయంలో విష్ణు దేవ్ సాయి ప్రభుత్వం గణనీయమైన విజయం సాధిస్తుందని ఆశించడం వ్యర్థం. పరిస్థితి మారలేదు. ప్రస్తుతం, ప్రభుత్వానికి ఒక సానుకూల పరిణామం ఉంది. రాష్ట్రానికి కొత్త, సమర్థవంతమైన ఐఏఎస్ అధికారి ప్రధాన కార్యదర్శిగా వచ్చారు మరియు ఆయన ఈ పదవిని చేపట్టి రెండు నెలలు మాత్రమే అయింది. ఈ స్వల్ప కాలంలో ఆయన నియామకానికి ముందు మరియు తరువాత పరిపాలనా యంత్రాంగం యొక్క స్థితిని అర్థం చేసుకుని ఉండేవారు. కొన్ని రోజుల క్రితం కార్యదర్శులు మరియు సీనియర్ అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన కొన్ని కఠినమైన నిర్ణయాలు తీసుకున్నారు. వివిధ విభాగాలకు బడ్జెట్ కేటాయింపులు ఉన్నప్పటికీ, పరిపాలనా అనుమతులు పొందడానికి నెలలు పడుతుందని చూసి ఆయన చాలా ఆశ్చర్యపోయారు. ఉదాహరణకు ఈ సంవత్సరం బడ్జెట్‌లో రోడ్ల కోసం ప్రజా పనుల శాఖకు 9500 కోట్లు కేటాయించినప్పటికీ పట్టణ మరియు గ్రామీణ రోడ్ల పరిస్థితి చాలా దారుణంగా ఉన్నప్పటికీ, ఇప్పటివరకు 1900 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. ఈ విభాగాలలోని అధికారులు ఎలా పనిచేస్తున్నారో ఇది సూచిస్తుంది.

ఈ పరిస్థితులలో, ప్రభుత్వ కొత్త మరియు పాత పథకాలను సమర్థవంతంగా అమలు చేయడంలో ప్రధాన కార్యదర్శి కఠినమైన సవాలును ఎదుర్కొంటున్నారు, తద్వారా ప్రయోజనాలు అవసరమైన వారికి సులభంగా చేరుతాయి. గత రెండు సంవత్సరాలుగా, సాయి ప్రభుత్వం కొన్ని రంగాలలో గణనీయమైన అపఖ్యాతిని సంపాదించింది. వారు గత కాంగ్రెస్ ప్రభుత్వం యొక్క విజయవంతమైన పథకాలలో కొన్నింటిని రీబ్రాండ్ చేసి, వాటి అమలును నెమ్మదించారు. అదేవిధంగా, కొత్త ఉపాధ్యాయుల నియామకం, ఆరోగ్య శాఖలో కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ లేదా పేదల కోసం ప్రధానమంత్రి ఆవాస్ యోజన వంటి అనేక పథకాలలో, వాస్తవాలు చాలా భిన్నంగా ఉన్నాయి. సామాన్య ప్రజలకు మొదటి దెబ్బ విద్యుత్ ధరలు పెంచినప్పుడు, మరియు గత ప్రభుత్వం అందించిన సబ్సిడీని సగానికి తగ్గించినప్పుడు తగిలింది. ఐదు సెంట్లు లేదా అంతకంటే తక్కువ విస్తీర్ణం ఉన్న ప్లాట్ల రిజిస్ట్రేషన్‌ను నిలిపివేసి, ఫీజులను పెంచినప్పుడు ఇటీవల రెండో దెబ్బ తగిలింది. ప్రభుత్వం ఈ విషయాన్ని పునఃపరిశీలిస్తున్నప్పటికీ, దాని ప్రతిష్టకు జరగాల్సిన నష్టం ఇప్పటికే జరిగిపోయింది. ఇవన్నీ కాకుండా, నక్సలిజం మరియు నక్సలైట్లను నిర్మూలించే ప్రచారం వెనుక కేంద్ర ప్రభుత్వ స్వప్రయోజనాలు ఉన్నాయని బస్తర్‌లో విస్తృతంగా చర్చ జరుగుతోంది.

బస్తర్‌ను నక్సలిజం నుండి విముక్తి కల్పి స్తామని, గిరిజనులను భయం మరియు దోపిడీ కోరల నుండి విడిపిస్తామని చెబుతూనే, అభివృద్ధి పేరుతో అదానీ వంటి పారిశ్రా మికవేత్తలకు సహజ వనరులను దోచుకోవడానికి ప్రభుత్వం స్వేచ్ఛనిస్తోందని ఆరోపణలు వస్తున్నాయి. బొగ్గు నిల్వలు సమృ ద్ధిగా ఉన్న ప్రాంతాలలో మైనింగ్ కోసం అడవుల విధ్వంసానికి వ్యతిరేకంగా నెలల తరబడి పోరాటం జరుగుతోంది. ప్రజా ఉద్యమాలు మరియు నిరసనలు కొనసాగుతున్నప్పటికీ, అవి ప్రభుత్వంపై ఎలాంటి ప్రభావం చూపలేదు.

కేంద్ర హోంమంత్రి అమిత్ షా మార్చి 2026 నాటికి బస్తర్‌ను నక్సల్ రహితంగా మారుస్తానని ప్రతిజ్ఞ చేశారు. ఈ ప్రచారం ఖచ్చితంగా విజయ వంతమవుతుంది. కానీ దీని తర్వాత, రాబోయే మూడు సంవత్స రాలలో మోడీ-షా-సాయి ప్రభుత్వం బస్తర్ రూపురేఖలను ఎలా మారుస్తుందో చూడాలి. సిద్ధం చేస్తున్న అభివృద్ధి ప్రణాళిక గిరిజనులకు ఆమోదయోగ్యంగా ఉంటుందా? తమ సంస్కృతి మరియు సంప్రదాయాల పరిరక్షణ విషయంలో గిరిజనులు మరియు మతం మారిన గిరిజనుల మధ్య జరుగుతున్న సంఘ ర్షణ భవిష్యత్ ప్రమాదానికి సంకేతం. రాజకీయంగా మరియు సామాజికంగా, ఈ వర్గాల మధ్య పరస్పర సామరస్యం మరియు అవగాహనను కాపాడాల్సిన బాధ్యత సాయి ప్రభుత్వంపై ఉంది. కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు బస్తర్ పట్ల ఉన్న అభిమానం అందరికీ తెలిసిందే. డిసెంబర్ 13న జరిగే బస్తర్ ఒలింపిక్స్ ముగింపు వేడుకకు ఆయన ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. వచ్చేసారి ఆయన బస్తర్‌లోని మారుమూల ప్రాంతంలో జరిగే ఒక కార్యక్రమంలో పాల్గొన్నా ఆశ్చర్యపోనవసరం లేదు.

– రాజధాని వార్తల ద్వారా అనువాదం

మూలం: cgkhabar

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan